


'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 5,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 68.500 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,150, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 2600, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

INTERVIEW

నత్రజని ఎరువులు

అధికంగా వాడొద్దు!



- విత్తనాల ఎంపిక, శుద్ధి ప్రధానం
- ఎరువుల కొరత రానీయం
- కృత్రిమ కొరత, ధరలు పెంచితే కఠిన చర్యలు
- వ్యక్తిగతంగా యంత్రాలు ఇచ్చే అవకాశం ఉంది
- 'ఆంధ్రజ్యోతి'తో డీఏవో సత్యవాణి

"వ్యవసాయంలో ముఖ్యంగా వరిసాగులో నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. లేకుంటే తెగుళ్లు, పురుగులు పైరును ఆశించి, దిగుబడులపై ప్రభావం చూపుతాయి.' అని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) సత్యవాణి అన్నారు. రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ద్వారా ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విత్తనాలు, ఎరువుల కోసం అన్నదాతలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్న ఆమె కృత్రిమ కొరతలు సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. వ్యక్తిగత రుణాలు, యంత్ర పరికరాలు కావాలని చాలాచోట్ల రైతులు అడుగుతున్నారని, ఆ మేరకు తాము ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. త్వరలోనే కర్షకుల కోరిక నెరవేరే సూచనలు ఉన్నాయని అన్నారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

6

● భక్తజన సందోహం



నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవంలో శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠం విశాఖపట్నం పీఠాధిపతి రామానంద భారతీ స్వామి పాల్గొన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేశారు.

6

జిల్లాలో నలుగురు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు

● రేపు విజయవాడలో అవార్డుల ప్రదానం

నెల్లూరు (విద్య), (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో విశిష్ట సేవలందించిన జిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. పాఠశాల విభాగంలో పొదలకూరు డీఎన్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్, కొడవలూరు మండలం, గండవరం జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ టీచరు గుంజి నాగభూషణం, నెల్లూరు రూరల్ వైఎస్ఆర్ నగర్ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు జె.రామమోహన్, బుచ్చిరెడ్డిపాళెం రామచంద్రాపురం ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయులు గండికోట సుధీర్‌బాబులు ఎంపికయ్యారు. అలాగే ఇంటర్మీడియట్ విభాగంలో కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్ డాక్టర్ పి.మునిరాజా, ఉన్నత విద్యా విభాగంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు డాక్టర్ విద్యా ప్రభాకర్ కొడాలి రాష్ట్ర అవార్డులకు ఎంపికయ్యారు. ప్రతి ఏడాది జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఈ అవార్డులను అందచేస్తుండగా ఈ ఏడాది విజయవాడలో వరదల కారణంగా ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. తాజాగా ఈ నెల 11వతేదీన జాతీయ విద్యాదినోత్సవం నాడు విజయవాడలో అవార్డులు అందచేయనున్నట్లు విద్యాశాఖ డైరక్టర్ వి.విజయరామరాజు తెలిపారు.

● ఏపీ ఉర్దూ అకాడమీ అవార్డులు

విద్యారంగంలో ఉర్దూ సేవలందించిన వారికి ఏపీ ఉర్దూ అకాడమీ రాష్ట్రస్థాయి అవార్డులను ప్రకటించింది. ఉపాధ్యాయుల విభాగంలో ఉదయగిరి నార్త్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు పరాన్ సందానీబేగం, ఉదయగిరి బీసీ కాలనీ ఎంపీపీయూపీ ఉపాధ్యాయులు షేక్.సుల్తానాబేగం, ఏఎస్‌పేట జడ్పీపీ ఉపాధ్యాయుడు షేక్.జిలానీభాషాలు రాష్ట్ర అవార్డులకు ఎంపికయ్యారు. అలాగే విద్యార్థుల విభాగంలో ఆత్మకూరు జడ్పీపీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షేక్.హలీమాసాదియా, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్.సానియా, నెల్లూరు జెండావీధి పీఎస్ఎం మునిసిపల్ పాఠశాలకు చెందిన షేక్.అలేఖాజునీరియస్‌లు రాష్ట్ర ఉత్తమ విద్యార్థుల అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 11న విజయవాడలో అవార్డులు అందజేయనున్నారు.



కోటంరెడ్డికి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు, అభిమానులు

పేరు	పార్టీలో హోదా	పదవి
కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి	నుడా చైర్మన్
పోలంరెడ్డి దినేష్‌రెడ్డి	టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు	ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
ఆనం వెంకట్రమణారెడ్డి	టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి	ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్
సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి	కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు	ఆర్టీసీ నెల్లూరు రీజన్ బోర్డు చైర్మన్

విశ్వసనీయులకే పట్టం!

● జిల్లాలో నలుగురిని వరించిన పదవులు ● రెడ్డి సామాజిక వర్గానికి సముచిత స్థానం

నెల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల రెండవ జాబితాలో సింహపురికి సముచిత స్థానం లభించింది. జిల్లాకు చెందిన నలుగురు నాయకులకు కీలక పదవులు వరించాయి. తెలుగుదేశం పార్టీ నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఆనం వెంకట్రమణారెడ్డిలతోపాటు బీజేపీ నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి పదవులు దక్కాయి. తొలి విడత జాబితాలో జనసేన నాయకుడు అజయ్‌బాబును హౌసింగ్ బోర్డు చైర్మన్ పదవి వరించగా, ఇప్పుడు బీజేపీకి చెందిన నాయకుడు సురేష్ రెడ్డికి ఆర్టీసీ నెల్లూరు రీజనల్ బోర్డు చైర్మన్ పదవి దక్కింది. దీంతో కూటమిలోని టీడీపీ సహా జనసేన, బీజేపీలకు కూడా జిల్లా నుంచి సముచిత స్థానం లభించినట్లు అయ్యింది. ప్రస్తుతం నామినేటెడ్ పదవులు పొందిన ఈ నలుగురు నాయకులు పార్టీ పట్ల విధేయత, విశ్వసనీయత ప్రదర్శించినవారే. సుదీర్ఘ కాలం ఆయా పార్టీలో కొనసాగిన వారు కొందరు కాగా, పార్టీ ప్రయోజనాల కోసం వ్యక్తిగత ప్రయోజనాలను త్యాగం చేసినవారు, ధీటైన విమర్శలతో అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజల దృష్టిలో దోషులుగా నిలబెట్టిన వారూ ఉన్నారు.



ముచ్చటగా మూడోసారి..

నెల్లూరు నగర ప్రజలకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి. సుదీర్ఘ కాలంగా ఈయన తెలుగుదేశం పార్టీలో క్రియాశీల నాయకుడిగా కొనసాగుతున్నారు. నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వంలో నుడా చైర్మన్‌గా రెండుసార్లు పనిచేశారు. 2019-23 వరకు నెల్లూరు సిటీ టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఐదేళ్ల వైసీపీలో ఆ పార్టీ నాయకుల దౌర్జన్యాలను ధీటుగా ఎదుర్కొన్నారు. పార్టీ కేడర్‌కు అండగా నిలిచారు. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్ ఆశించారు. టికెట్టు దక్కకపోయినా ఎన్నికల్లో శ్రమించారు. నుడా చైర్మన్ పదవికి పలువురు పోటీ పడినా కోటంరెడ్డి పార్టీ పట్ల చూపిన విశ్వసనీయత, నందమూరి బాలకృష్ణ ఆశీస్సుల నేపథ్యంలో ఈయనకు మూడవసారి కీలక నుడా చైర్మన్ పదవి దక్కింది. కాగా, నటుడు నందమూరి బాలకృష్ణ కోటంరెడ్డికి ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు.

● పోలంరెడ్డి దినేష్ రెడ్డి



కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి రాజకీయ వారసుడిగా రాజకీయ ఆరంగేట్రం చేశారు. ఎన్నికల చివరి క్షణం వరకు ఐదేళ్లపాటు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. ఇక టికెట్టు ఇచ్చే సమయానికి రాజకీయ సమీకరణలు మారడంతో పార్టీ ప్రయోజనాల కోసం టికెట్టు విషయంలో రాజీపడ్డారు. టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు కోసం శక్తివంచన లేకుండా శ్రమించారు. పార్టీ పట్ల నిబద్ధత, విధేయతల నేపథ్యంలో దినేష్‌రెడ్డికి ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది.

ఆనం వెంకట్రమణారెడ్డి



మాజీ ఎమ్మెల్యే ఆనం భక్తవత్సలరెడ్డి కుమారుడు. 2009లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం తరఫున పోటీ చేశారు. ఆ తరువాత టీడీపీకి దగ్గరయ్యారు. ఆనం కుటుంబం మొత్తం కాంగ్రెస్, ఆ తరువాత వైసీపీలోకి వెళ్లినా ఈయన మాత్రం టీడీపీలోనే కొనసాగారు. కొంతకాలం సొంత వ్యాపారాలు చేసుకొంటూ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2002 నుంచి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. తన వాగ్ధాటితో, విషయ పరిజ్ఞానంతో అతి తక్కువ కాలంలోనే టీడీపీ అగ్రనాయకుల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆ క్రమంలోనే 2023లో పార్టీ ఈయనకు రాష్ట్ర అధికార ప్రతినిధి హోదా ఇచ్చింది. వైసీపీ నేతల కుంభకోణాలను

- మిగతా 6లో..



శుక్రవారం రాత్రికిరాత్రే భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్

కబ్జారాయుళ్ల బరితెగింపు

- ఐదెకరాల భూమిలో రాత్రికిరాత్రే కంచె ఏర్పాటు
- పట్టాదారులపై రౌడీమూకలతో దౌర్జన్యం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ఆక్రమణదారుడు వైసీపీ నేత?

మర్రిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భూ అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ముఖ్యంగా జిల్లా సరిహద్దు మండలమైన మర్రిపాడులో కాసింత జాగా కనిపిస్తే చాలా రాత్రికిరాత్రే కంచె వేసేస్తున్నారు. తాజాగా నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి పక్కనే వైసీపీకి చెందిన ఓ నాయకుడు ఐదెకరాల భూమిని కబ్జా చేశారు. సర్వే నెంబర్లు 1383-2సీ, 1385-1, 1385-2, 1385-3లలో జాతీయ రహదారి పక్కనే ఉన్న సీజేఎఫ్ఎస్ భూములను 15 ఏళ్ల క్రితం ఏడు కుటుంబాలకు సుమారు 24 ఎకరాలను పంపిణీ చేశారు. అయితే, ఈ భూముల్లోకి పట్టాదారులను వెళ్లనివ్వకుండా ఏడేళ్లుగా అక్రమార్కులు అడ్డుకుంటున్నారు. అంతేగాక ఎవరైనా సదరు భూమిలో సాగు చేస్తే పంటను ధ్వంసం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఏడాది క్రితం బాధితులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేస్తామంటూ అధికారులు దీక్షను విరమింప చేశారు. కబ్జాదారులు అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో సన్నిహితులు కావడంతో బాధితులకు న్యాయం జరగలేదు. నాటినుంచి తమకు న్యాయం చేయాలంటూ ప్రతి సోమవారం జరుగుతున్న గ్రీవెన్స్‌లో

- మిగతా 6లో



పట్టాదారులతో ఘర్షణకు దిగుతున్న బయటి ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు



- అటవీశాఖలో పదేళ్లగా భర్తీకాని పోస్టులు
- క్షేత్రస్థాయిలో పూర్తిగా ఖాళీలు
- 3,500 హెక్టార్లకు ఒక్కరే పర్యవేక్షణ
- ఉన్నవారిపై అదనపు పనిభారం
- సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల వేడుకోలు
- నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం

వారిది అరణ్య రోదనే

నెల్లూరు వెంకటేశ్వరపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పందిళ్లపల్లి శ్రీనివాసులు (ఐఎఫ్ఎస్) 1982లో కర్నాటకలో అటవీ అధికారిగా (డీఎఫ్‌వో) విధులు నిర్వహించేవారు. ఎర్రచందనం స్మగ్లర్ వీరప్పన్‌లో మార్పు తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. 1991 నవంబరు 9న 'లొంగి పోతాను.. నువ్వు ఒక్కడివే అడవికి రా'.. అంటూ వీరప్పన్ శ్రీనివాసులుకు కబురు పంపాడు. అది నమ్మి వెళ్లిన శ్రీనివాసులును నవంబరు 10న వీరప్పన్ దారుణంగా హత్య చేశాడు. విధి నిర్వహణలో వీర మరణం పొందిన శ్రీనివాసులుకు కీర్తిచక్ర బిరుదును ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ అటవీ అమరవీరుల సంస్మరణ దినంను నవంబరు పదవ తేదీన జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లా అటవీశాఖ ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



● సమస్యలు తీర్చేవారేరీ?

అటవీ ఉద్యోగులు కుటుంబాలను వదిలి ఒంటరిగా రోజుల తరబడి తిరుగుతూ అడవులను రక్షిస్తున్నారు. వన్యప్రాణులను రక్షణ కల్పించ డంలో తలెత్తే సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తుంటారు అలాంటి అటవీ ఉద్యోగులు అనేక ఒత్తిళ్లను, సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారుగా 2,82,000 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది.ప్రధానంగా జిల్లా పరిధిలో ఎర్రచందనం రక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణను కూడా అటవీ సిబ్బందే చూసుకోవాలి. సుమారు 3500 హెక్టార్ల అడవికి ఒక్కరే రక్షణ కల్పించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం జిల్లాలో ఉన్నాయి. జిల్లాలో క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది పూర్తిగా లేకుండా పోయారు. దీంతో ఉన్న వారిపై అదనపు పనిభారం పెరిగింది.

ఖాళీలు భర్తీ చేయాలి



అటవీశాఖలో పదేళ్లగా ఉద్యోగాల భర్తీని ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో కింది స్థాయి సిబ్బంది పూర్తిగా లేకుండా పోయారు. ఏబీవోలు 70 మంది ఉండాల్సి ఉండగా ఒక్కరూ కూడా లేరు. ఈ పరిస్థితిఓ ఉన్న వారిపై అదనపు భారం పడుతోంది. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయలి.

- ఎస్. పిచ్చిరెడ్డి, అటవీ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పని ఒత్తిడి లేకుండా చర్యలు



జిల్లాలోని అటవీ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. ఉద్యోగులకు ఎక్కడా పని ఒత్తిడి లేకుంగా చర్యలు తీసుకొంటున్నాం. ఎర్ర చందనపై ప్రత్యేక నిఘా పెట్టాం.

- మహబూబ్ బాషా టెరిటోరియల్, డీఎఫ్‌వో

● భర్తీకాని పోస్టులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అటవీ ఉద్యోగులు కొరత తీవ్రంగా ఉంది. సుమారుగా పదేళ్ల నుంచి అటవీశాఖలో ఖాళీల భర్తీ జరగలేదు. రెండేళ్ల క్రితం కేవలం నలుగురు సిబ్బందిని మాత్రమే జిల్లాకు కేటాయించారు. పూర్తి స్థాయిలో 250 మంది ఉండాల్సి ఉండగా, కేవలం 150 మాత్రమే ఉన్నారు. రేంజర్ పోస్టులు 3, బీట్ అధికారులు 120 మందికిగానూ 90 మంది, ఏబీవో(అసిస్టెంట్ బీట్ అధికారులు)లు 70 మందికిగానూ ఒక్కరూ లేరు. ఉన్నవారంతా పదోన్నతులు పొంది బీట్ అధికారులు అయ్యారు. అటవీ సంరక్షణతో పాటు ఇటీవల ఎస్ఆర్ఈజీ ఎస్ ద్వారా పనులు చేయించాల్సి వస్తున్నది.దీంతో తగినంత మంది సిబ్బంది లేక ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రచందనం స్మగ్లర్ల నుంచి రక్షణ కోసం గతంలో తుపాకులు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే అది పూర్తి స్థాయిలో అమలు జరగలేదు. ఖాళీల భర్తీ కోసం ముందస్తు పదోన్నతులు కల్పించే వీలున్నా ఉన్నతాధికారులు ఆవైపు దృష్టి పెట్టడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అటవీ ఉద్యోగాలను భర్తీచేయడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

దైవానుగ్రహంతో కార్తీక లక్ష దీపార్చన



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దైవానుగ్రహంతోనే కార్తీక మాస లక్ష దీపోత్సవం జరుగుతుందని శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠం విశాఖపట్నం పీఠాధిపతి రామానంద భారతీ స్వామి తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో నెల్లూరు నగరంలోని వీఆర్సీ మైదానంలో శనివారం రెండో రోజు జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను అనుగ్రహిస్తూ ప్రవచనం చేశారు. వీపీఆర్ దంపతులు మంచి సంకల్పంతో 8 ఏళ్లుగా చేస్తున్న మహాశివునికి జరిగే ఈ పూజకు ఆటంకం కలుగకుండా పంచభూతాలు ఈ మైదానంలో కలియ తిరుగుతున్నాయన్నారు. రాజకీయాల్లో ఉంటూ ఆధ్యాత్మిక సేవ చేసే శక్తి, భాగ్యం వేమిరెడ్డి దంపతులకు భగవంతుడు కల్పించిన మంచి అవకాశం అన్నారు. కాశీ, శ్రీశైలం, చిదంబరం, అరుణాచలం వంటి పుణ్యక్షేత్రాల పుణ్యం ఈ కార్తీక మాస లక్ష దీపోత్సవంలో లభిస్తుందన్నారు. కార్తీక మాసంలో ఉసిరికను సేవిస్తే ఆయురారోగ్యాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి స్వహస్తాలలో, కార్తీక లక్ష దీపారాధన, ఆకాశదీపం, బాలరామునికి మల్లెపూలు, తులసీదళాలతో సహస్ర నామార్చనలు చేశారు. ఉదయం విశేష రుద్రహోమం, 108 మంది దంపతులతో ఆంజనేయస్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, ఆకుపూజ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, తదితర ప్రముఖ నాయకులు పాల్గొని పూజలు చేశారు.

రామా నంద భారతీ స్వామి

నేటి కార్యక్రమాలు

ఆదివారం ఉదయం 9గంటలకు వీర వెంకటసత్యనారాయణ స్వామి వ్రతం, రాత్రి 7గంటలకు మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామీజీ అనుగ్రహ ప్రవచనం జరుగుతుంది.



కార్తీక దీపోత్సవంలో పూజలు చేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

నోటికాడ ముద్ద అవినీతి రాబందుల పాలుచేసిన దాష్టీకం గత వైసీపీ ప్రభుత్వానిది. పొట్ట కూటి కోసం పరాయి పంచన చేరి దేహీ అనే పరిస్థితి లేకుండా ఉన్నచోటే ఉపాధి చూపిన మానవత్వం తెలుగుదేశం ప్రభుత్వానిది.

చేతులు కట్టి, కడుపు కొట్టి రాక్షసుల పొట్ట నింపిన ఘనత అనాటి ప్రభుత్వానిది. ఊరిపక్కనే పొట్టపోసుకునే అవకాశం కల్పించిన ఉదారత నేటి ప్రభుత్వానిది.

ఇసుక పాలసీ విషయంలో గత వైసీపీ ప్రభుత్వానికి, నేటి కూటమి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా ఇది. జిల్లా పరిధిలోని వేలాది మంది పేదల మనోగతమిది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు

- ఉచిత ఇసుక పాలసీపై కూలీల మనోగతం
- వైసీపీ హయాంలో వలసెళ్లామయ్యా!
- కూటమి ప్రభుత్వంలో పని దొరుకుతోంది!
- రోజుకు రూ.1000 దాకా సంపాదించుకుంటున్నా!
- ఆనందం వ్యక్తం చేస్తున్న పేదలు

నాడు కొడుపు కొట్టారు..

నేడు నింపుతున్నారు!

ఇసుక.. ఊరి ప్రజలకు ప్రకృతి ప్రసాదించిన ఆస్తి. ఊళ్లు వెలిసినప్పటి నుంచి ఐదేళ్ల క్రితం వరకు ప్రజలు ఇలాగే భావించారు. తమ పరిధిలోని వాగులు, వంకలపై హక్కును అనుభవించారు. అయితే గత పాలకులు ఇసుక నుంచి రూ.కోట్లు కొల్లగొట్టారు. ఇసుక పాలసీ పేరుతో నదులు, వాగులు, వంకలను గంపగుత్తగా అస్మదీయులకు అప్పగించి ఇసుక విక్రయాల ద్వారా కోట్లు కూడబెట్టుకున్నారు. రీచ్‌ల చుట్టూ ప్రైవేటు సైన్యంతో రక్షణ వలయాలు, ప్రజలు కాదు కదా అధికారులు సైతం అటు వైపు చూడలేని, అడుగుపెట్టలేని విధంగా దాస్టీకాలు నెరపి ఇక్కడి ప్రజలకు ఇసుక అందకుండా చేసి మొత్తం పక్క రాష్ట్రాలకు తరలించారు. ఇసుక రీచ్‌ల్లో లోడింగ్ చేయడమే జీవనాధారంగా బతుకుతున్న పల్లెలను పస్తుల పాలు చేశారు. మనిషి అన్నవాడు ఎవడూ పార చేతపట్టుకొని జిల్లా పరిధిలోని ఏ వాగులోకి వంకలోకి దిగడానికి వీలు లేదు. తట్ట ఇసుక తెచ్చుకోవడానికి వీల్లేదు. అన్నట్లు గుత్తేదారులు వాగులు, వంకలపై సర్వాధికారాలు చెలాయించారు. ఒకటి కాదు.. రెండు కాదు... ఐదేళ్లు ఊరిపక్కన ఉపాధి దొరికే మార్గం ఉన్నా అక్కడికి వెళ్లే అవకాశం లేక పేదలు పొట్ట చేతపట్టుకొని ఇతర పనుల కోసం పక్క ఊళ్లకు వలసవెళ్లారు. పరాయిపంచకు చేరి కాయకష్టం చేసుకునే అవకాశం కోసం దేహీ అన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే వైసీపీ ప్రభుత్వానికి పూర్వం శ్రామిక చెమటతో పులకించిన నదులు, వాగులు గత ప్రభుత్వ పుణ్యమా అని కరకు యంత్రాల ఇనుప పళ్లకు గుండెలు పగిలేలా మూగగా రోదించాయి. ప్రకృతి వేదనో.. సహజ వనరుల శాపమో... కారణమేదైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదల కళ్లు.. నదీమాతల్లుల గుండెలు ఆనందంతో చెమ్మగిల్లుతున్నాయి.

● ఇసుక మేటల్లో శ్రమ సౌందర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకున్న మానవీయ నిర్ణయాల్లో ఇసుక పాలసీ ఒకటి. ఈ పాలసీ పేద, ధనిక వర్గాలనే తేడా లేకుండా అందరికీ ఆమోదయోగ్యంగా గుర్తించబడింది. కూటమి ప్రభుత్వం కూడా ఇసుక పాలసీ విషయంలో తర్జన భర్జన పడింది. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి ఇసుక ద్వారా ఎంతో కొంత ఆదాయం తెచ్చుకుందామనే ఆలోచనలు చేసింది. అయితే ఆదాయం కన్నా జనహితమే ప్రధానం అనుకున్నారో ఏమో ఉచిత ఇసుక పాలసీ విధానం తెచ్చారు. ప్రజలకు, శ్రామికులకు మేలు చేసే కొత్త ఆలోచన చేశారు. రీచ్‌లో వాహనాల లోడింగ్‌కు శ్రామికులనే ఉపయోగించాలని చట్టం చేశారు. ట్రాక్టర్లు తప్ప టిప్పర్లు రీచ్‌లోకి వెళ్లడానికి వీలులేకుండా చట్టం చేశారు. రీచ్‌లో జేసీబీలు దిగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు ఇసుక వెళ్లకుండా నిషేధం విధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఇసుక లభ్యత ఉన్న అన్ని రీచ్‌లు శ్రామికులతో కళకళలాడుతున్నాయి. ఐదేళ్ల పాటు కళ్ల నీళ్లు తెప్పించిన ట్రాక్టరు ఇసుక ధర ఇప్పుడు సామాన్యులు సైతం కొనగలిగే స్థాయికి తగ్గిపోయింది. ముఖ్యంగా వేలాది మంది పేదలకు ఉపాధి లభించింది. పొద్దుపొడవక ముందే రీచ్‌లోకి దిగి సల్లపూటే కూలి సంపాదించుకొంటున్నారు. రోజుకు కనిష్ఠంగా రూ. 500 నుంచి 1000 వరకు కూలి గిట్టుబాటు అవుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'అయ్యా..!! వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు కూలి దొరక్క, ఊరూరా తిరిగాం. ఇప్పుడు మా ఊళ్లోనే మాకు ఉపాధి దొరికిందయ్యా.' అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాయకష్టమే పెట్టుబడిగా స్వేదం చిందించే శ్రమజీవుల ఆనందం వారి మాటల్లోనే..

రోజూ పని దొరుకుతోంది



ప్రతీరోజు ఇసుక ట్రాక్టర్లకు లోడింగ్ చేసేందుకు పని దొరుకుతోంది. గత ప్రభుత్వంలో రీచ్‌లో మిషన్లు పెట్టి మా పొట్ట కొట్టారు. ఇప్పుడు కూలీలతోనే రీచ్‌ల్లో ఇసుక లోడింగ్ చేయాలనే నిబంధనతో మాలాంటి కూలీలు ఆనందంగా ఉన్నాము. రోజుకు కనీసం రూ.1000 నుంచి 1500 గిట్టుబాటు అవుతోంది.

- రవీంద్ర, నెల్లూరు

కడుపునిండా తింటున్నాం



రీచ్‌ల్లో ఇసుక లోడింగ్ కూలీలతోనే చేయాలన్న ముఖ్యమంత్రి నిర్ణయంతో మా కుటుంబం కడుపునిండా తినగలుగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో రీచ్‌ల్లో మిషన్లు పెట్టడంతో పనులు లేక అల్లాడిపోయాము. ఇప్పుడు ప్రతీరోజు పని దొరుకుతోంది. ఈ పద్ధతిని ఇలాగే కొనసాగించాలి

- వెంకట రమణయ్య, నెల్లూరు

చేతినిండా పని దొరికింది



ప్రభుత్వం ఇసుక ఉచితం చేయడం వల్ల ట్రాక్టర్లు ఎక్కువగా ఏట్లోకి వస్తున్నాయి. దీని వల్ల మాకు చేతినిండా పని దొరికింది. మరిగిన్ని డబ్బులు సంపాదించుకోగలుగుతున్నాము. ఉదయం నుంచి ఏట్లోనే ట్రాక్టర్లకు ఇసుక కొడుతున్నాము. చాలా సంతోషంగా ఉంది.

- ఏకుల వెంకయ్య

పనికి బయట ఊర్లకు పోబల్లేదు



ఇంతకముందు పనుల కోసం పొరుగు ఊర్లకు పోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంకో ఊరికి పోవాల్సిన పని లేకుండాపోయింది. పక్కనే పెన్నానది ఉండటంతో ఇక్కడే చేసుకున్నంత పనుంది. మా ఊరికే బయటూరోళ్లు వచ్చి పని చేస్తున్నారు. ఇదే కొనసాగితే మంచిది.

- ఆడిపూడి పోలయ్య

ఉచిత ఇసుక వల్ల కష్టాలు తీరాయి



కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక వల్ల మాలాంటి కూలీలకు కడుపునిండా కూడు దొరకడంతోపాటు ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల కష్టాలు కూడా తీరాయి. ఇసుక కోసం గత ప్రభుత్వంలో జనాలు ఎంత అల్లాడారో, అలాంటి వారందరికీ ఇప్పుడు ఇసుక సమృద్ధిగా అందుతోంది. మాకు చేతినిండా పని ఉండడంతో రోజు రూ.వెయ్యి వరకు గిట్టుబాటు అవుతుంది. ఈ పని నిరంతరాయంగా ఉంటే మా కష్టాలు తీరినట్టే.

- సీహెచ్.నాగరాజు, విరువూరు

ఇసుక లోడింగ్ పనితో ఉపాధి



సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుకతో పేదల ఇంటి నిర్మాణం, ఉచిత ఇసుకతో బేల్దారులకు పనులతోపాటు మాకు మా ఊర్లోనే మంచి ఉపాధి లభించింది. ఇంతకు ముందు కరువు పని, మామూలు రైతు కూలీ పనులకు వెళ్లేవాళ్లం. వాటికంటే ఇప్పుడు ఆదాయం బాగుంది. ఆరుగురు కలిసి ట్రాక్టర్ ఇసుక లోడింగ్ చేస్తాం. ఒక్కొక్కరికి రోజు రూ.800 నుంచి రూ.వెయ్యి గిట్టుబాటు అవుతుంది.

- ఎస్.అంకయ్య, విరువూరు

చంద్రబాబు పుణ్యం.. ఉపాధి దొరికింది



ముఖ్యమంత్రి చంద్రబాబు పుణ్య మా రోజూ ఏట్లో ట్రాక్టర్లకు ఇసుక లోడుచేసే పనులు దొరుకుతున్నాయి. మా కుటుంబాలను, పిల్లల్ని ఆనందంగా పోషించుకుంటున్నాము. గతంలో యంత్రాలు పెట్టి కూలీలకు పనుల్లేకుండా చేశారు.

- వెంకటరమణమ్మ, జొన్నవాడ

రోజూ పనులున్నాయి!



గతంలో టీడీపీ ప్రభుత్వంలోనూ, ఇప్పుడూ కూటమి ప్రభుత్వంలో సీఎంగా చంద్రబాబుతోనే కూలీల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. ఉచిత ఇసుకతో ట్రాక్టర్లకు, కూలీలకు రోజూ రూ.700 నుంచి వెయ్యి సంపాదిస్తున్నాం.

- తాటిపర్తి నరసయ్య, జొన్నవాడ

రైల్వే అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- నెల్లూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్ఎం
- ఓహెచ్ఈ భవనం ప్రారంభం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో పునరాభివృద్ధి పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని విజయవాడ డివిజన్ రీజయన్ మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఏ పాటిల్ ఆదేశించారు. శనివారం నెల్లూరుకు వచ్చిన ఆయన ముందుగా రైల్వే స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన ఓహెచ్ఈ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం స్టేషన్‌లో ప్రయాణికుల వసతులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డిసెంబరు నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎస్ఎస్ శివయ్య, పలువురు డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

ఇంటర్వ్యూ...

నత్రజని ఎరువులు అధికంగా వాడొద్దు!

- అధిక దిగుబడులకు విత్తనాల ఎంపిక, శుద్ధి ప్రధానం
- 'ఆంధ్రజ్యోతి'తో డీఏవో సత్యవాణి

? విత్తనాల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

! విత్తనాల ఎంపికలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. సర్టిఫైడ్ రకాలనే ఎంపిక చేసుకోవాలి. అంతేగాక విత్తనాలకు సంబంధించి బిల్లు, లాట్ నెంబరు, చివరికి సంచి కూడా పంట చేతికొచ్చేదాకా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలి.

? ఎరువుల కొరత ఉందంటున్నారు

! ఎరువులతోపాటు విత్తనాల విషయంలో రైతులకు సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. ప్రతి నెలా జిల్లాకు జరిగే కేటాయింపులకంటే అధికంగా 20వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అసరమని ఆయా కంపెనీల ప్రతినిధులకు ఇప్పటికే తెలియజేశాం. జిల్లా అవసరాలకు అనుగుణంగా దిగుమతులు చేసుకుంటున్నాం. ఇప్పటికే యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్స్ ఎరువులు దాదాపు 44,843 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. విత్తనాలు దాదాపుగా రైతులు తీసుకున్నారు. ఇంకా 69 వేల క్వింటాళ్లు గోదాముల్లో ఉన్నాయి.

? తెగుళ్లు, పురుగుల నివారణ ఎలా

! నత్రజని ఎరువులను ఎక్కువగా వాడటం వల్లే పంటకు తెగుళ్లు, పురుగులు ఆశిస్తున్నాయి. ఆ ఎరువుల వాడకం తగ్గించాలి. ఎకరాకు 35 కేజీల చొప్పున మూడుసార్లు 105 కేజీలు వినియోగిస్తే సరిపోతోంది. కానీ రైతులు రెండు నుంచి మూడు బస్తాల ఎరువులను వాడుతున్నారు. ఇది రైతుకు అదనపు పెట్టుబడి. పంటకు నష్టం కూడా. నత్రజని ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

? మంచి దిగుబడులకు మీ సూచనలు

! పంట దిగుబడిలో నాణ్యమైన విత్తన ఎంపికే ప్రధానం. ఆ తరువాత విత్తనశుద్ధి ఎంతో ముఖ్యం. విత్తనాల ద్వారా ఆశించే పురుగులు, తెగుళ్లను నివారిస్తుంది. ఎక్కువ విత్తనాలు మొలకెత్తేందుకు ఉపయోగపడుతుంది. ఒకేరీతిలో మొలకలు వస్తాయి.

? వ్యక్తిగత యంత్రాలు సమకూరుస్తారా

! గ్రామాల్లో మేము తిరిగిన ప్రతిచోటా వ్యక్తిగత పరికరాలు, ట్రాక్టర్లు, టార్పాలిన్ పట్టలు కావాలని రైతులు అడుగుతున్నారు. వాటిని జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది. వ్యక్తిగతంగా పరికరాలు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

? వ్యాపారుల దోపిడీకి కళెం వేస్తారా

! మార్కెట్లో ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టంగా, కఠినంగా హెచ్చరించాము. కృత్రిమ డిమాండ్ సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగా చెప్పాము. ఆ మేరకు ఆదేశాలు కూడా జారీ చేశాము.

? భూసార పరీక్షల మాటేమిటి

! జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 23,300 మట్టి నమూనాలు సేకరించాము. అందులో ఇప్పటికే 10వేల నమూనాల ఫలితాలు వచ్చాయి. మిగిలినవి డిసెంబరు మొదటి వారంలోగా పూర్తిచేసి రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

కృష్ణపట్నం పోర్టులో భారీ నౌక

● రికార్డు స్థాయిలో ఐరన్ ఓర్ దిగుమతి


ముత్తుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అదానీ కృష్ణపట్నం పోర్టులో రికార్డు స్థాయిలో ఐరన్ ఓర్ దిగుమతి జరుగుతోంది. పోర్టులోని ఐదో నెంబరు బెర్త్‌లో లంగర్ వేసిన భారీ నౌక ఎంవీ మినరల్ వుటమరో నుంచి ఇనుప ఖనిజాన్ని అన్‌లోడ్ చేస్తున్నారు. రికార్డు స్థాయిలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్‌కు మొత్తం 193,402 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ దిగుమతి అవుతున్నది. పోర్టు అధికారులు అద్భుతమైన సాధన సందర్భంగా షిప్ మాస్టర్‌కు మెమోంటోను అందించి సత్కరించారు. 2018 ఫిబ్రవరి 26న జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ లిమిటెడ్ కోసం ఎంవీ సమ్మాన్ అగ్రోనాట్ నౌక ద్వారా 192,856 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని రవాణా చేసి నెలకొల్పిన రికార్డును ఈ నౌక అధిగమించింది. కార్యక్రమంలో ఏకేపీఎల్ సీవోవో రాజన్‌బాబు, మెరైన్ హెడ్ కెప్టెన్ రజత్‌గార్గ్, కెప్టెన్ బీ సాహరాహరాస్ మెరైన్, సెక్యూరిటీ హెడ్ మేజర్ వెంకటేష్, భాస్కరన్, పోర్టు కంట్రోల్ మెరైన్ ఇన్‌చార్జ్ జునాద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయులకే పట్టం!

(5వ పేజీ తరువాయి)

ఈయన సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. ఈయన చేసిన సేవలను గుర్తించి అధిష్ఠానం ఈయనకు ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా నియమించింది.

సురేష్‌రెడ్డి



ఈయన స్వస్థలం తోటపల్లి గూడూరు మండలం చిన్న చెరుకూరు. నాలుగు దశాబ్దాలుగా బీజేపీలో క్రియాశీల నాయకుడిగా కొనసాగుతున్నారు. 1984 నుంచి ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, బీజేపీలలో వివిధ బాధ్యతల్లో పని చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2004లో నెల్లూరు సిటీ నుంచి, 2014లో నెల్లూరు రూరల్ నుంచి, 2019లో నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేశారు. పార్టీకి ఈయన చేసిన సేవలను గుర్తించి బీజేపీ కోటా కింద ఆర్టీసీ నెల్లూరు రీజన్ బోర్డు చైర్మన్‌గా నియమించారు.

12న మంద కృష్ణమాదిగ రాక

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఈనెల 12న నెల్లూరుకు వస్తున్నారని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ చెప్పారు. శనివారం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు తరువాత తొలిసారిగా నెల్లూరుకు వస్తున్న మందకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నేతలు ఎం. పెంచలయ్య, ఎస్. ఉదయ్‌కృష్ణమాదిగ, గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రేపు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ఈనెల 11వ తేదీ ఉదయం 9.30 గంటలకు తమ శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమా శాఖాధికారి, అదనపు జిల్లా వక్ఫ్ అధికారి శ్రీనివాసరావు ఒక ప్రటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

కబ్జారాయుళ్ల బరితెగింపు

(5వ పేజీ తరువాయి)

బాధితులు అర్జీలు ఇస్తూనే ఉన్నారు. కానీ అధికారులు మాత్రం చొరవ చూపడం లేదు. తాజాగా శని, ఆదివారాలు సెలవులు కావటంతో అధికారులు అటు వైపు రారనే ఉద్దేశంతో శుక్రవారం రాత్రికి రాత్రే అక్రమార్కులు బరితెగించారు. పొంగూరు రెవెన్యూలోని సర్వే నెంబర్లు 899-2-2బీ, 899-2-3డీ, 900-1ఏ, 899-2-3ఏలోని ఐదు ఎకరాల భూమిలో ట్రాక్టర్ సహాయంతో డ్రిల్ వేసి చుట్టూ సిమెంట్ స్తంభాలను నాటించి, ఇనుప ముళ్ల కంచెను చుట్టేశారు. విషయం తెలుసుకున్న పట్టాదారులు తెలుసుకుని పొలం వద్దకు పరుగులు తీశారు. అయితే, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమను అడ్డగించి, ఘర్షణకు దిగారని బాధితులు వాపోయారు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. రెవెన్యూ అధికారుల నిర్ణయం మేరకు విచారిస్తామని, అప్పటివరకు ఇరువర్గాలను భూమిలోకి వెళ్ల వద్దని పోలీసులు సూచించారు.

మాకొద్దు మద్యం షాపు!



మా ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ ముస్లిం మహిళలు శనివారం జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నివాస ప్రాంతాలు, మసీదులు, పాఠశాలలు, మదరసాలు వద్ద మద్యం షాపులు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేశారు. అందులో భాగంగా నెల్లూరు నగరంలోని పరమేశ్వరీనగర్ వాకర్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన 30వ నెంబరు మద్యం షాపును తొలగించాలని కోరారు. దీని కోసం ఇప్పటికే క్షేత్ర స్థాయి అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అర్జీలు ఇచ్చామన్నారు. షాపులు ప్రకటించినప్పటి నుంచి స్థానికులు ఆందోళన చేపడుతున్నా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

ఆదమరిస్తే అంతే..



మండలంలోని తూర్పు బోయమడగల-వరికుంటపాడు గ్రామాల సమీపంలో రహదారి మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా గండిపాళెం జలాశయం 5వ నంబరు కాలువపై నిర్మించిన వంతెన మీదుగా ప్రయాణాలు సాగించే వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని,అదీనూ ఓవైపు రక్షణగోడ కొంతమేర కూలిపోవడంతో ఆదమరిస్తే కాలువలో పడిపోయే ప్రమాదముందని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- వరికుంటపాడు (ఆంధ్రజ్యోతి)

రుణాలు ఇప్పిస్తామంటూ
పేదలకు కుచ్చుటోపీ!

- రూ.10లక్షలతో ఉడాయించిన యువకుడు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కలువాయి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తామంటూ ఓ యువకుడు పేద ప్రజలను మోసంచేసి సుమారు రూ.10లక్షలు వసూలుచేసుకుని పరారైన సంఘటన కలువాయి మండలంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చింతల పాళెంకు చెందిన ఓ యువకుడు తెలుగురాయపురం, నూకనపల్లి దళిత కాలనీలోని పలువురి వద్దకు వెళ్లి తాను ఆర్‌బీఐలో ఉద్యోగం చేస్తున్నానని, రూ.8లక్షల నుంచి రూ.14లక్షల వరకు ఒకొక్కరికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తామని నమ్మించాడు. ఇందులో కొంత సబ్సిడీ కూడా ఉంటుందని... అయితే ఇందుకు ముందుగా కొంత మొత్తం ఇవ్వాలని కోరాడు. దీంతో రుణాలు వస్తాయని ఆశ పడినవారు ఒకొక్కరూ రూ.15 వేల నుంచి రూ. 40వేల వరకు ఆ యువకుడికి ఇచ్చారు. రెండు గ్రామాలకు చెందిన 29 మంది సుమారు రూ.10లక్షలు ఇచ్చారు. డబ్బు వసూలుచేసుకునిపోయిన యువకుడు ఎంతకూ రుణాలు ఇప్పించలేదు. అడిగితే రెడీ అవుతున్నాయి.. రేపు, మాపు అంటూ నమ్మిస్తూ వచ్చాడు. కాగా, రుణాల కోసం యువకుడికి ఫోన్ చేస్తే ఆ ఫోన్ చింతల పాళెంకు చెందిన యువతి ఎత్తి నేను సార్ దగ్గర పనిచేస్తున్నాను.. సార్ మీటింగ్‌లో ఉన్నాడు... మీ రుణాలు త్వరగా ఇప్పిస్తామంటూ ఆమె కూడా నమ్మకంగా చెబుతూ వచ్చింది. ఏడాది గడిచినా వారికి రుణాలు ఇవ్వకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి శుక్రవారం పోలీసులను ఆశ్రయించి మోసం చేసిన యువకుడిపై చర్యలు తీసుకుని మా డబ్బు మాకు ఇప్పించాలని బాధితులు కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రక్కు ఆటో

- ముగ్గురికి గాయాలు





క్షతగాత్రులకు వైద్య సేవలు అందచేస్తున్న 108 సిబ్బంది

సంగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ట్రక్కు ఆటో ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పెరమన రోడ్డు సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కడప వైపు వెళ్లే లారీ పెరమన క్రాస్ రోడ్డు పక్కన ఆగి ఉండగా సంగం వైపు నుంచి కమ్మీల మంచాల లోడుతో వెళ్తున్న ట్రక్కు ఆటో వెనుక వైపు ఢీకొంది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఆటోలో ఉన్న రాజశేఖర్, శ్రీకాంత్, వెంకట సుబ్బయ్య అనే ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో మూడు బైక్‌ల చోరీ

వెంకటాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట, కసుమూరు, మొలకలపూడి గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మూడు మోటర్ బైక్‌లను చోరీ చేశారు. బాధితులు వారి ఇళ్ల వద్ద బైక్‌లు ఉంచగా, అపహరించుకు వెళ్లారు. శనివారం ఉదయం బైక్‌లు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాపర్ వైర్లు కొట్టుకుపోతున్న కేటుగాళ్లు

- పొదలకూరు సబ్‌డివిజన్‌లో ఆరునెలల్లో 58 చోరీలు



ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలు తీసుకెళ్లిన దొంగలు(ఫైల్)

పొదలకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేటుగాళ్ల కన్నేశారంటే కాపర్ వైర్లు చోరీకి గురికావాల్సిందే. ప్రాణాంతకమని తెలిసినా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో సయ్యాటలాడతారు. అర్ధరాత్రి మొదలు, కోడి కూసే లోపు ఎత్తుకుపోతారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో ఉండే రవ్వంత రాగి కోసం చిల్లర దొంగలు ఆశపడి, ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి రాగి వైరును దొంగిలిస్తున్నారు. దీంతో పొలాల్లో ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొదలకూరు సబ్‌డివిజన్ పరిధిలోని పొదలకూరు, విరువూరు, మనుబోలులలో గత ఆరు నెలల వ్యవధిలో 58 ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగలు ధ్వంసం చేసి, రాగి వైరును అపహరించుకు వెళ్లారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లలో 5 నుంచి 20 కేజీల దాకా కాపర్ వైర్ దొరుకుతుంది. మార్కెట్లో దీని విలువ రూ.5వేల వరకు ఉంటుంది. దొంగ కాపర్ అని పసికట్టిన వ్యాపారులు ఆ దొంగల నుంచి రూ.2వేలకు కొనుగోలు చేస్తుంటారు. రూ.2వేల కోసం కాపర్ దొంగలు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దొంగలు వైరు కోసం పగుల కొట్టిన ట్రాన్స్‌ఫార్మర్‌లు రిపేరు చేయడానికి వీలు కావు. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.2.50లక్షల వరకు ఉంటుంది. పాత ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడానికి నెల నుంచి రెండు నెలల సమయం పడుతుంది. ఈ సమయంలో పంటలకు నీరు పెట్టుకోలేక రైతులు నానా అవస్థలు పడతారు. ఈ విషయమై పొదలకూరు సబ్ డివి జన్ విద్యుత్ ఏడీఈ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులు కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల భద్రత విషయంలో తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	119
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)


ఒక గ్రాము ధర	రూ.7498
వెండి కిలో ధర	రూ. 93,600
వెండి ఒక గ్రాము	రూ.96.60

ఇద్దరిపై రౌడీషీట్‌ల నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తూ పదేపదే నేరాలకు పాల్పడుతున్న మనుమసిద్ధి నగర్‌కు చెందిన షేక్ జకీర్‌బాషా, డైకాస్ రోడ్డు సుభాస్‌చంద్రబోస్ నగర్‌కు చెందిన షేక్ రబ్బానీలపై చిన్నబజారు పోలీసులు శనివారం రౌడీషీట్లు తెరిచారు. నిందితులపై వివిధ పోలీసు స్టేషన్‌లలో పలు కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు.

టీకా వేద్దాం..
నిండు జీవితాన్ని ఇద్దాం!

- పుట్టిన బిడ్డకు 8 రకాల వ్యాక్సిన్
- ప్రాణాంతక వ్యాధులు సోకకుండా
- లక్ష్య సాధనలో ఇప్పుడిప్పుడే పురోగతి
- గతంలో 45 శాతం.. ఇప్పుడు 95 శాతం పూర్తి
- నేడు ప్రపంచ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం



నెల్లూరు (వైద్యం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు వెంటనే వివిధ రకాల వ్యాధులు ప్రబలకుండా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అవయవ లోపాలతోపాటు ప్రాణాలు పోయే ప్రమాదమే ఏర్పడుతుంది. గతంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో 45 శాతం చిన్నారులకు కూడా టీకాలు వేసేవారు కాదు. ఈ పరిస్థితి నుంచి ఈ ఏడాది 95 శాతం వ్యాధినిరోధక టీకాలు వేసి లక్ష్యానికి చేరువయ్యారు. అయితే, పోలియో నియంత్రణకు మాత్రం ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు మిగిలిన వ్యాధి నిరోధక టీకాలపై శ్రద్ధ కనబరచడం లేదన్న విమర్శలు ఉన్నాయి. క్షయ, పోలియో, మసూచి, ధనుర్వాతం, కోరింత దగ్గు, కంఠసర్పి వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు యేటా జిల్లాలో రూ.60 లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితాలు మాత్రం ఆశాజనకంగా లేవు. జిల్లాలో ఏటా 3.26 లక్షల మంది చిన్నారులకు నిర్దేశించిన కాలానికి అనుగుణంగా టీకాలు వేయాలి. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది నవంబరు 10వ తేదీన ప్రపంచ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది. తద్వారా ప్రజలకు టీకాలు వేయించుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చింది.

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

జిల్లాలో 52 ఆరోగ్య కేంద్రాలతోపాటు 28 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరులలో ఏరియా ఆసుపత్రులు, నెల్లూరులో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో ప్రతి బుధ, శని వారాలలో గ్రామాల్లో తిరిగి గుర్తించిన పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు నిత్యం ఈ విధుల్లో ఉండాలి. అయితే, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం మూలంగా టీకాల అమలుపై అనేక సందేహాలు రేకెత్తుతున్నాయి. గత మూడేళ్లుగా నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరలేదన్న వాదన వినిపిస్తోంది.

అవగాహన కల్పించాలి

ఏటా పోలియోకు మాత్రం రూ.లక్షలలో ఖర్చు చేసి విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అయితే మిగిలిన వ్యాధుల ప్రచారం, అవగాహనలో మాత్రం అధికార యంత్రాంగం చేతులెత్తేస్తోంది. ఈ టీకా వేసుకుంటే వ్యాధులు రావు, తప్పనిసరిగా వేయించుకోమని ప్రచారం చేసే పరిస్థితి లేదు. కనీసం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగినా టీకాలు సక్రమంగా ఎప్పుడెప్పుడు వేసుకోవాలో చెప్పరు. ప్రస్తుతం మెదడు వాపు వ్యాధి వచ్చే కాలం అయినా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించరు. కేవలం సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు మాత్రం నిర్వహిస్తున్నారే తప్ప ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఇంకా పూర్తిస్థాయి అవగాహన కల్పించలేని పరిస్థితి నెలకొంది.

పక్కాగా అమలుకు కృషి చేస్తున్నాం

జిల్లాలో ప్రతి చిన్నారికి ఎనిమిది రకాల వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది ఎక్కడెక్కడ చిన్నారులు ఉన్నారో గుర్తించి జీరో డోస్ ఓపీవీ వ్యాక్సిన్‌లో 99.28 శాతం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తగినంత టీకాలు అందిస్తున్నాయి.



- డాక్టర్ ఉమా మహేశ్వరి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

వ్యాధి నిరోధక టీకాలు ఇలా...

- పుట్టిన వెంటనే బిడ్డకు క్షయ, పోలియో, కామెర్లు వంటి వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయించాలి.
- ఒకటిన్నర, రెండున్నర, మూడున్న నెలల తరువాత మరోసారి పోలియో చుక్కలు వేయించాలి.
- కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం రాకుండా 45,75,105 రోజుల వ్యవధిలో డీపీటీ వ్యాక్సిన్ వేయాలి.
- 9వ నెలలో తట్టు, అమ్మవారు రాకుండా మీజల్స్ వేయించాలి.
- ఒకటిన్నర, రెండున్నర, మూడున్నర నెలల్లో మరోసారి హెపటైటిస్-బీ వ్యాక్సిన్ వేయించాలి.
- కంటి వ్యాధులు రాకుండా విటమిన్-ఏ వ్యాక్సిన్ వేయించాలి.
- మెదడువాపు వ్యాధి రాకుండా జేఈ వ్యాక్సిన్ వేయించాలి.
- 18 నెలల తరువాత డీపీటీ, పోలియో, మీజల్స్, జేఈ, విటమిన్ ఏ వ్యాక్సిన్ వేయించాలి.
- 24 నుంచి 60 నెలల్లోపు చిన్నారులకు విటమిన్-ఏ, డీపీటీ వ్యాక్సిన్ వేయాలి.

వీఎస్‌యూలో డ్రోన్ పైలట్ శిక్షణ



డ్రోన్ పైలట్ శిక్షణపై ప్రతినిధులతో చర్చిస్తున్న వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో డ్రోన్ పైలట్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారం భించబోతున్నట్లు వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్ రావు తెలిపారు. శనివారం సంబంధిత ప్రతినిధులతో కలిసి ఆయన చర్చలు జరిపారు. అనంతరం మాట్లాడుతూ డ్రోన్ సాంకే తికత పారిశ్రామిక నైపుణ్యాలు, ఔత్సాహికతను ప్రోత్సహించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. దీని ద్వారా వ్యవసాయ రంగంలోని మహిళలకు ఉపాధి అవకాశాలను పెంచే నైపుణ్యాలను అందించవచ్చున న్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, డ్రోన్ సంస్థ ప్రతినిధులు రితేశ్‌కుమార్ సింగ్, బరహలికర్ నరసింగరావు, పవన్‌కుమార్ చిట్టే, శ్రీనివాస్ ప్రసాద్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య పురస్కార సభ



సన్మానం అందుకుంటున్న తోట నిర్మలరాణి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని టౌన్‌హాల్ రీడింగ్ రూమ్‌లో స్వర్గీయ పాతూరి మాణిక్యమ్మ దశమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం జాతీయ స్థాయి సాహిత్య పురస్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 'అద్దం నా చిరునామా కాదు' కవితా సంపుటి రచించిన తోట నిర్మలా రాణికి నగదు పురస్కారం అందజేసి సన్మానించారు. రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు ఏ.జయప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.కుమార్‌రాజా ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా మెట్టు రామచంద్ర ప్రసాద్, డాక్టర్ పెళ్ల కూరు జయప్రద, పురస్కార ప్రదాత పాతూరి అన్నపూర్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఎంపీడీవో పలమనేరు బాలాజీ పుస్తక సమీక్ష చేశారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.కుమార్‌రాజా మాట్లాడుతూ బతికి ఉన్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలపాలు చేస్తున్న ఈ రోజుల్లో ప్రముఖ రచయిత్రి డాక్టర్ పాతూరి అన్నపూర్ణ గత పదేళ్లుగా తన తల్లి పేరున సాహిత్యవేత్తలను సన్మానించి సత్కరించి నగదు బహుమతి అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అవార్డు న్యాయనిర్ణేత మందరపు హైమావతి, పెద్ద సంఖ్యలో సాహితీ వేత్తలు, కవులు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న మంత్రి నారాయణ

ఉచిత ఇసుకపై ప్రత్యేక దృష్టి

- రీచ్‌లను పరిశీలించిన మంత్రి నారాయణ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఉచిత ఇసుక అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ, దీనదయల్‌నగర్ ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లను శనివారం ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.4 వేల నుంచి రూ.5వేలు అమ్మేవారని, ప్రస్తుతం రూ.1200 దిగివచ్చిందన్నారు. ఉచిత ఇసుక కేవలం ట్రాక్టర్ బాడుగ తీసుకొని ప్రజలకు చేరవేస్తున్నారని తెలిపారు. ఈ ధరలను ఇంకా తగ్గించేలా చర్యలు తీసుకొంటామన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక మాట నిలబెట్టుకొన్నదన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాస్తా మెరుగు పడేవరకూ ప్రజలు ఓపిక పట్టాలన్నారు. అటు సంక్షేమంతో పాటు అభివృద్ధి సమానంగా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీవో నాగ సంతోష్ అనూష, టీడీపీ నగర అధ్యక్షుడు మధు, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా అంబళం పూజ

పొదకలూరు (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయంలో వెలిసి ఉన్న అయ్యప్పస్వామికి శనివారం 46వ అంబళం పూజను అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పడిపూజ, అనంతరం తీర్థ ప్రసాదాలు వినియోగం జరిగింది. గురు స్వాములకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాలధారణ స్వాములు అయ్యప్ప సేవా సమితి సభ్యులు బ్రహ్మదేవి రాజశేఖర్, కాసా శ్రీనివాసులు, గ్రామ పెద్దలు శివాడ పరంధామిరెడ్డి, అల్లూరు రమణయ్యస్వామి, ముత్తుస్వామి, గొళ్ల రమణయ్య, తదతరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులతో భూసారానికి ముప్పు

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): విచక్షణా రహితంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం దెబ్బతింటోందని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జీ.శివన్నారాయణ పేర్కొన్నారు. నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో సమేతి, మేనేజ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజ మాన్యం అంశంపై జరిగిన శిక్షణ కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకం వల్ల పర్యావరణం సైతం కలుషితమవుతోందని తద్వారా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని చెప్పారు. ఈ సమస్యలకు పరి ష్కారం సేంద్రియ ఎరువుల వాడకమేనని అవగాహన కల్పించారు. కృత్రిమ ఎరు వుల కారణంగా కోల్పోయిన భూసారాన్ని తిరిగి సారవంతం అవుతాయని వివరిం చారు. ఈ కార్యక్ర మంలో కేవీకే పంటల ఉత్పత్తి విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కే.కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

కావలిరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, కులమతాలకు చిచ్చుపెట్టేలా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని కావలి ఒకటోపట్టణ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. ప్రధాని, సీఎం, ఉప ముఖ్యమంత్రి, కావలి ఎమ్మెల్యేలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన నలుగురిపై శనివారం టీడీపీ నేత జ్యోతి బాబూరావు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు ఆత్మకూరు రాజేష్, సుందరరాజు, సబ్బా ప్రభావతి, దామెర్ల శ్రావణ్‌కుమా ర్‌లపై కేసు నమోదు చేశామ న్నారు.

పీహెచ్‌డీ గ్రహీతకు సన్మానం

బిట్రగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జే ఎన్టీయూఏ అనంతపురం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌తో పీహెచ్‌డీని పొందిన కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ అధ్యాపకురాలు బృందావనిని శనివారం కళాశాల ఏవో రమణారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సునీల్‌రెడ్డి, అన్నివిభాగాల అధ్యాపకులు ఉన్నారు.

రసీదులు లేని సెల్‌ఫోన్లు కొనొద్దు

బిట్రగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తుల వద్ద రసీదులు (బిల్లులు) లేని సెల్‌ఫోన్లు కొనుగోలు చేసి ఇబ్బందులకు పడవద్దని ఎస్‌ఐ బోజ్య తెలిపారు. బోగోలు మండలం తిప్ప పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన ఈ విషయంపై మాట్లాడారు. తక్కువ ధరకు వస్తున్నాయని సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తే అవి చోరీ చేసినవి అయితే ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోటి సోమవారం సందర్భంగా పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయంతో పాటు గండిపాళెం, అప్పసముద్రం, కుర్రపల్లిగడ్డ, లింగాలదొన, అప్పసముద్రం, గుడినరవ తదితర గ్రామాల్లో శివాలయాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి అభినందన

ఉదయగిరి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):నార్త్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పీ సందానిబేగం రాష్ట్రస్థాయి ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపిక కావడంతో పలువురు ఉపాధ్యాయులు శనివారం అభినందనలు తెలిపారు. ఈనెల 11న జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుంటారు.

ఆలయ నిర్మాణానికి నేడు శంకుస్థాపన

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లో ఆదివారం నూతన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి మొక్కులు చెల్లించనున్నారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కా ర్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశే ఖర్‌రెడ్డిలు పాల్గొంటారన్నారు. కావున మండల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పరీక్ష కేంద్రం, స్పాట్ సెంటర్ 'ప్రైవేటు'కు !

- మంజూరుపై విద్యారంగ నిపుణుల విమర్శలు
- ప్రభుత్వ కళాశాల ఉండగా.. మరి అక్కడెందుకో ?
- 'ఆంధ్రకేసరి' తీరుపై విస్మయం



టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కందుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఏర్పాటైన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కళాశాలలను కాదని, అరకొర సదుపాయాలు ఉన్న ప్రైవేటు కళాశాలలకు పరీక్ష కేంద్రాలు, స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లు కేటాయించటంపై విద్యా రంగనిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

● **టీఆర్‌ఆర్‌ను కాదని..**

ప్రకాశం, నెల్లూరు జిల్లాలోనేకాక రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన, ఇటీవలే అటానమస్ హోదా సాధించిన టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎగ్జామ్ సెంటర్, స్పాట్ వాల్యూ యేషన్ సెంటర్‌ను రద్దుచేసి యూనివర్సిటీ వీసీ, ఇతర అధికారులు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలకు మంజూరు చేయటం పట్ల అధ్యా పకులు, విద్యావంతులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు ఎంతో ఉన్నతస్థాయిలో ఉన్నం దునే నాక్ ఏ ప్లస్ గుర్తింపును ఇవ్వటమే గాక అటానమస్ హోదా కూడా వచ్చింది. అలాగే కళాశాలలో అనుభవజ్ఞులైన, అత్యున్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఈ కళా శాలలో సుమారు 20మంది వరకు పీహెచ్‌డీ పూర్తి చేసిన అధ్యాపకులు ఉన్నారు. ఇలాంటి కళాశా లను కాదని మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్న, విద్యార్హతలు లేని అధ్యాపకులు పనిచేస్తున్న ప్రైవేటు కళాశాలపై యూనివర్సిటీ అధికారులు మోజు పడటంలోని ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

● **అబ్జర్వర్‌గా కారు డ్రైవర్**

ప్రస్తుతం డిగ్రీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా, ఈ పరీక్షలకు అబ్జర్వర్‌గా అర్హత లేని వ్యక్తిని నియమించారని ప్రభుత్వ అధ్యాపకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. యూనివర్సిటీలోని ఉన్నతాధికారిణి కారు డ్రైవర్‌గా ఉన్న వ్యక్తిని దర్శిలోని ఓ ప్రైవేటు కళాశాల అధ్యాపకుడిగా బోగస్ సర్టిఫికెట్ సృష్టించి అతడ్ని అబ్జర్వర్‌గా నియమించారని టీఆర్‌ఆర్ కళాశాల అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారుల తీరు పరీక్షలు, స్పాట్ వాల్యూయేషన్‌ను దిగజార్చేలా ఉన్నదని వారు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని వారు కోరుతున్నారు.

సాగునీరు వృథా చేయొద్దు

- సోమశిల దక్షిణ కాలువ ఈఈ మల్లికార్జున



కలువాయి, (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులు నార్లు పోసుకుని నీరు వృథా కాకుండా చూడాలని ఈఈ మల్లికార్జున సూచించారు

? సోమశిల దక్షిణ కాలువకు నీరు విడుదల చేశారా.

! మూడురోజుల నుంచి నార్లు పోసుకునేందుకు కాలువకు నీరు విడుదల చేశాం. సీజన్‌లో 42వేల ఎ కరాలకు నీరివ్వాలని ప్రతి పాదించాం. 120రోజులు త రువాత అవసరమైతే మరో 20 రోజులు నీరు ఇస్తాం.

? కాలువలు ఎలా ఉన్నాయ్

! ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ కాలువలన్నీ బాగున్నాయి. చివరి ఆయకట్టుకు నీరం దేలా చూస్తాం.

? రైతులకు ఇచ్చే సూచన ఏమిటి.

! రైతులంతా ఒకేసారి ఆలస్యం చేయకుండా నార్లు పోసుకుంటే చివరిఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందుతుంది. దీనివల్ల నీటి వృథాను కూడా అరికట్టవచ్చు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే విష్ణు జన్మదినం



కేక్ కట్ చేస్తున్న విష్ణు అభిమానులు

అల్లూరు (ఆంధ్రజ్యోతి), నవంబరు 9: మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదినాన్ని ఆయన అభిమానులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పాత బస్టాండు కూడలిలోని విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు అనంతరం భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంత రాజు బాలకృష్ణం రాజు, గోసల గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, సుధాకర్, దండ కృష్ణారెడ్డి, మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

● **రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ**

కావలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు శనివారం కావలి ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, గోసల గోపాలరెడ్డి, పద్మనాభరెడ్డి , గోపి కృష్ణం రాజు, నిరంజన్ పాల్గొన్నారు.

దళిత యువకుడి ఆత్మహత్యాయత్నం



యర్రజొన్న గోవర్ధన్

లింగసముద్రం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నెబోయినపల్లి ఎస్సీ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు యర్రజొన్న గోవర్ధన్ అనే యువకుడు నాయకులు, పోలీసుల వేధింపులు తాళలేక గురువారం రాత్రి అత్తగారి ఊరు కొండాపురం గ్రామ శివారులో పు రుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు, అతని బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోవర్ధన్ కందుకూరు శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన తలతోటి మస్తాన్ అనే బిల్డర్ వద్ద రెండేళ్లుగా పని చేస్తున్నాడు. అయితే గోవర్ధన్ మస్తాన్‌కు కొంత మొత్తం బాకీ పడ్డాడు. తాను పనికి రాలేనని అప్పు నిదానంగా తీరుస్తానని మస్తాన్‌కు చెప్పాడు. రెండురోజుల క్రితం మస్తాన్ గోవర్ధన్‌ను కందుకూరుకు పిలిపించి అనుచరులు తీవ్రంగా బెదిరించి కందుకూరు పోలీసులకు గోవర్ధన్‌పై ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీ సులు గోవర్ధన్‌ను పోలీస్‌స్టేషన్‌కు పి లిపించి రాత్రి ఒంటిగంట వరకు నిర్బం ధించి వేధింపులకు గురి చేశారు. గోవర్ధన్ మస్తాన్‌కు రూ.1.50 లక్షలు మాత్రమే బాకీ ఉంటే రూ.5లక్షలు బాకీ ఉన్నట్లు ఖాళీ పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించారు. ఆ డ బ్బులు ఇవ్వకపోతే చంపేస్తారని, వారి చేతుల్లో చావడం కంటే తానే పురుగు మందు తాగి చని పోతానని సెల్ఫీ వీడియో తీస్తూ తాగి అది తన బంధువులకు పంపించాడు. తనను వేధించిన బిల్డర్ మస్తాన్‌ను, పోలీసులపై చర్య లు తీసుకోవాలని గోవర్ధన్ అందులో కోరాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అత న్ని కావలికి తరలించి ప్రథమ చికిత్స చేయిం చారు. వైద్యం కోసం నెల్లూరు నారాయణ వైద్యశాలకు తరలించి చి కిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి విష మంగా ఉందని తండ్రి వీరయ్య శనివారం రాత్రి తెలిపారు.

జోరుగా బెల్టు అమ్మకాలు

కావలి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మారుమూల గ్రామాల్లో సైతం పుట్టగొడుగుల్లా బెల్టుదుకాణాలు వెలుస్తు న్నాయి. రుద్రకోటలో 15 బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు ఆందోన వ్యక్తం చేస్తున్నారు. అరుంధతీయవాడలో పోటాపోటీగా 3బెల్టు దుకాణాలు నిర్వహిస్తుండగా ఉదయం 6గంటల నుండి రాత్రి 10గంటల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. బెల్టు దుకాణాలల్లో మద్యం తాగేందుకు వీలుగా టేబుళ్లు వేసి మరీ ఉంచటం బార్లను తలపిస్తున్నాయని చెబుతున్నారు. రుద్రకోటలోని మద్యం దుకాణం నుండి ఎంఆర్పీ ధర మీద రూ.5లకు అదనంగా తీసుకుని చుట్టు పక్క గ్రామాల్లో బెల్టు దుకాణాలను విక్రయిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోనేరులో పడి వ్యక్తి మృతి

ఉలవపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాల స్వామి కోనేరులో శనివారం సాయంత్రం 4.30గంటల సమయంలో మతిస్థిమితం లేని యువకుడు (30) పడి మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే ఎస్‌ఐ అంకమ్మ సిబ్బందితో కలిసి కోనేరు వద్దకు చేరుకున్నారు. నీటిలో గాలించి మృతదేహాన్ని బయటకు తీసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో తనే స్వయంగా నీటిలోకి దూకి గాలింపు చర్యలు చేపట్టాడు. ఎస్‌ఐకు స్థానికులు మరో ఇద్దరు సహాయపడటంతో ఎట్టకేలకు మృతుదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడు నాలుగు రోజుల క్రితం చాగొల్లు ఇందిరానగర్ కాలనీలో వాటర్ ట్యాంక్ ఎక్కి స్థానికులను కంగారు పెట్టడంతో పోలీసులు అతన్ని స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రశ్నించగా తనది బీహార్ అని మాత్రమే చెప్పాడని మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించనట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజులుగా ఉలవపాడు వీధుల్లో తిరుగుతు ఉండటం గమనించినట్లు స్థానికులు చెబుతున్నారు.

మాలకొండ ఆదాయం రూ.11.47లక్షలు

వలేటివారిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహా స్వామి హుండీ ఆదాయం రూ.11.47లక్షలు వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెం పొడపాటి మాలకొండయ్య రమణమ్మ దంపతులు మనుమళ్లు లక్ష్మీనరసింహం, వెంకటమన్విక్‌ల పుట్టు వెంట్రుకల సందర్భంగా ఆలయంలో భక్తుల అన్నదానానికి రూ.1,30,000అందజేసినట్లు పేర్కొన్నారు.

50మంది విద్యార్థుల ఎంపిక

కందుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ బైక్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఫైనలియర్ విద్యార్థులు 50మంది ఎంపికైనట్లు కళాశాల టెక్నికల్ డైరక్టర్ విజయ్‌శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంపెనీ హెచ్‌ఆర్ రాజమోహన్ ఆధ్వర్యంలో జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 64మంది ఎంపికల ప్రక్రియకు హాజరైనట్లు పేర్కొన్నారు. వీరు చెన్నైలోని టీవీఎస్ కంపెనీలో జాయిన్ కావాల్సి ఉంటుందన్నారు.

వేమిరెడ్డి దంపతులకు మాజీ ఎమ్మెల్యే వంటేరు సత్కారం



వేమిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

జలదంకి, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులను శనివారం మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అనుచరులతో కలిసి నెల్లూరు వెళ్లి గజమాలతో సత్కరించా రు. ఇటీవల ఎంపీని కేంద్ర విదేశీవ్యవహారాల సభ్యుడిగా కేంద్రం నియమించడం, ఎమ్మెల్యేను టీడీపీ సభ్యురాలిగా నియమించడంతో కార్యకమం చేపట్టా మన్నారు. వంటేరు వెంట శేషారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

నేడు కావలికి రానున్న శాప్ చైర్మన్

కావలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆదివారం మధ్యాహ్నం కావలికి వస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేతో కలిసి ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియంను సందర్శిస్తారన్నారు. అక్కడ స్థానికుల నుంచి సూచనలు స్వీకరించి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి సూచనల మేరకు స్టేడియం అభివృద్ధికి అవ సరమైన ప్రణాళికలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

ట్రూ అప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలి : సీపీఎం

జలదంకి, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారం మోపే ప్రయత్నం చేస్తోందని ఈ చార్జీలను ప్రభుత్వమే భరించాలని సీపీఎం నాయకులు రావి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ విషయంపై శనివారం ఆయన పార్టీ నాయకు లతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయం సురే చెంచురెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న ప్రజావ్యతిరేక విధానాలపై కలెక్టరేట్, తహసీల్దారు కార్యాలయాల్లో జరిగే ధర్నాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మేలంగి ఆంథోనీబాబు తాళ్లూరి మాల్యాద్రి పాల్గొన్నారు.

శివారు కాలనీల్లో వసతులు కల్పించండి

వలేటివారిపాలెం, నవంబరు 9: స్థానిక సమస్యలపై అధికారులు దృష్టి సారించి శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం కార్యదర్శి కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని వడ్డెపాలెంలో పార్టీ నాయకులు నిర్వహించిన ప్రజాపోరులో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి తక్షణం ట్రూఆప్ చార్జీల పేరుతో రూ.6400 కోట్లను కూటమి ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, మాధవరావు, లాజరు, నాగమ్మ, రాములమ్మ, కొండమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

అరుంధతివాడలో సీపీఎం ప్రజాపోరు

బిట్రగుంట, నవంబరు. (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ అరుంధతివాడలో శనివారం సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి ప్రజా సమస్యలపై ప్రజాపోరు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెరిగిన నిత్యవసరాలు, విద్యుత్ బిల్లులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీనియర్ నేత టి.వెంకయ్య, పోతల రమేష్, పోట్లూరి శీనయ్య తదితరులు ఉన్నారు.

తూర్పుబోయమడగలలో టీడీపీ సభ్యత్వ నమోదు

వరికుంటపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుబోయమడగలలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నెల్లూరు జిల్లా పార్లమెంట్ యువత కార్యదర్శి ఎంఎంకె చౌదరి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ రూ. 5లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అజయ్ యాదవ్, నారాయణ యాదవ్, నాదిండ్ల భాస్కర్ రావు, తోడిందల రత్తయ్య పాల్గొన్నారు.

● ఆత్మకూరు, నవంబరు 9: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో టీడీపీ నేతలు శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు మాట్లాడుతూ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు నలిశెట్టి శ్రీనివాసులు, షేక్ మహబూబ్‌బాష, బొబ్బల మల్లికార్జునయాదవ్, నలబోతుల వెంకటేశ్వర్లు, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌రెడ్డి ఎంపిక పట్ల హర్షం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా బీజేపీ సీనియర్ నాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం నియమించింది. బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రి నాయుడు శనివారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

● వింజమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు, బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా బీజేపీ నేత లెక్కమనేని రాజేష్‌నాయుడు శనివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉదయగిరి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గేదెను ఢీకొని మోటార్‌బైక్‌పై వెళుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. నేలటూరు గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి ఉదయగిరి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో సీతారామపురం నుంచి వస్తున్న టెంపో వాహనం సర్వరాబాదు సమీపంలో గేదెలను ఢీకొంది. దీంతో రోడ్డుపై పడి ఉన్న గేదెలను శ్రీను గమనించక ఢీకొట్టడంతో అ తనికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారులు గుర్తించి శ్రీనును చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. కాగా పశువులను ఢీకొన్న టెంపో వాహనం ఆపకుండా వెళ్లిపోయింది.

సమస్యల పరిష్కారానికి కృషి

సంగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అఖిల భారత సక్షమ్ దివ్యాంగుల సంస్థ జిల్లా కార్యదర్శి రంగయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఇరిగేషన్ అతిథి భవనం ప్రాంగణంలో మండలస్థాయి దివ్యాంగుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సక్షమ్ సంస్థ జిల్లా ప్రతినిధులు బాలసుబ్రహ్మణ్యం, నాగమణి, రాములమ్మ, రమణయ్య, స్వరూప, సంగం మండల సక్షమ్ ప్రముఖ్ అంజయ్య పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్‌లో జాతీయ న్యాయసేవల దినోత్సవం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి

కందుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.శోభారాణి పాల్గొని పౌరుల రక్షణకు అందుబాటులో ఉన్న వివిధ చట్టాల గురించి వివరించారు. మండల న్యాయసేవాధికార సంఘం అధికారుల పనితీరు, పౌరుల ఉచిత న్యాయ సహాయం కోరే వివిధ మార్గాలను వివరించారు. లోక్ అదాలత్, లీగల్ ఎయిడ్ క్లినిక్స్, పారా లీగల్ వలంటీర్లతో ఉచిత న్యాయసహాయం పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సంపత్‌కుమార్, ఏజీపీ జీ. హరికోటేశ్వరరావు, అధ్యాపకులు నరేష్‌రాజా, షానాజ్‌బేగం పాల్గొన్నారు.

వసతి గృహంలో విద్యుత్ సామగ్రి ఏర్పాటు

- సొంత నగదుతో వార్డెన్ రామకృష్ణ దాతృత్వం



వసతి గృహంలో వెలుగుతున్న ట్యూబు లైట్లు

లింగసముద్రం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో లైట్లు, ఫ్యాన్లు, స్విచ్చు బోర్డులను వార్డెన్ రామకృష్ణ రూ.రూ.22,500ల సొంత డబ్బుతో వేయించారు. విద్యార్థుల ఇబ్బందులు గమనించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వసతి గృహంలో 7 కొత్త ఫ్యాన్లు, 13 ట్యూబు లైట్లు, 10 స్విచ్చు బోర్డులు, వసతి గృహం మొత్తం వైరింగ్ ఏర్పాటు చేయించారు. వీటి ఏర్పాటుతో రాత్రి వేళ విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. అలాగే గ్రామ సర్పంచు పులి రాఘవులు కూడా నాలుగు స్టడీ లైట్లు ఉచితంగా ఏర్పాటు చేయించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే దగుమాటి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

బిట్రగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకూ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట పార్టీ నేత సన్నిగటి వేణును శనివారం ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం జేపీగూడూరు నాయకుడు పేరం క్రిష్ణారెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట నేతలు నాగేశ్వరావు, చిలకపాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లురెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్బారావు, అంకపునాయుడు, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

● **మొక్కల పంపిణీ**

కలిగిరి, నవంబరు 9: ఎరుకలరెడ్డి పాలెంలో స్థానిక టీడీపీ నేత షే క్ ఖాజామస్తాన్, నూర్‌జన్ దంపతుల మనుమడు అజ్హాన్ జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నేతలతో కలిసి మొక్కలు నాటి గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

● **గంధోత్సవ కరత్రాల ఆవిష్కరణ**

కావలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెండాచెట్టు సమీపంలోని నాగూరు మీరా స్వాముల గంధోత్సవ కరపత్రాలను శనివారం సాయంత్రం కావలిలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ఆవిష్కరించారు. డిసెంబరు 11న పట్టణంలో ఈ మహోత్సంను వైభవంగా నిర్వహిస్తామని మత పెద్దలు ఎమ్మెల్యేకు ఆహ్వానించారు. డిసెంబరు 2న సాయంత్రం చంద్రదర్శనం సందర్భంగా గంధ మహోత్సవ జెండా ఊరేగింపు చేపడతామన్నారు.

మాలల మహాగర్జనకు తరలిరండి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 26న మాలల జేఏసీ ఆధ్వర్యంలో మాలల మహాగర్జన సభ జరుగుతుందని, ఈ సభకు జిల్లా నుంచి మాలలు వేలాదిగా తరలిరావాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ కోరారు. శనివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో వెంకట రమణ విలేకరులతో మాట్లాడుతూ ఈ గర్జనలో మాల మేధావులు, మాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఆ గర్జన ద్వారా మాల డిమాండ్లను ప్రభుత్వానికి తెలియచేయటం జరుగుతుందన్నారు. మాలల సత్తా ఏమిటో ఈ గర్జన ద్వారా తెలియచేస్తామన్నారు. జిల్లా నుంచి మాల మేధావులు, మాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు దారా మల్లిఖార్జున, జిల్లా కార్యదర్శి ఏలూరు భరత్, పసల వెంకటరమణయ్య, అపలి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించాకే మార్కెట్ తొలగింపు : ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు9: వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాకే కూరగాయల మార్కెట్‌ను కూల్చివేసి, కొత్త మార్కెట్‌ను నిర్మిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. శనివారం కూరగాయల మార్కెట్‌ను, పందుల పెంపకందారులు ఖాళీ చేసిన స్థలాన్ని, నగర పంచాయతీలోని ఖాళీస్థలాలను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పాత మార్కెట్‌ను తొలగించి రూ. 60 కోట్లతో నిర్మించే మార్కెట్ నమూనాను, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను ఆమెకు అధికారులు వివరించారు. గాంధీనగర్‌లో ఖాళీ చేసిన అక్రమిత స్థలంలో చేపల మార్కెట్ ఏర్పాటుపై ప్లానింగ్‌ను ట్యాబ్‌ద్వారా పరిశీలించారు. అనంతరం 13వవార్డులో కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ, కమిషనర్, నాయకులతో కలిసి పబ్లిక్ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు హరికృష్ణ, ఎంవీ.శేషయ్య, రామానాయుడు, ప్రభాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు, తాళ్లస్వామి, అనిష్‌రెడ్డి, గౌస్ భాష తదితరులు ఉన్నారు.


బుచ్చిలో ఖాళీస్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

'నారాయణ'లో న్యూరో రాష్ట్రస్థాయి సదస్సు


జ్యోతి ప్రజ్వలనలో వైద్య నిపుణులు

నెలూరు(వైద్యం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నారాయణ వైద్య కళాశాలలో నెల్లూరు న్యూరో క్లబ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సినాక్స్ న్యూరో క్లినిక్ రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విద్యాసంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ బిజు రవీంద్రన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ నాడీ వ్యవస్థకు సంబంధించి వైద్య విజ్ఞానాన్ని తెలియచేసేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వైద్య నిపుణుల న్యూరాలజీ వ్యాధులు, చికిత్సలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజిస్టులు రమణమూర్తి, డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన న్యూరాలజిస్టులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

తోటపల్లిగూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామని రీసర్వే డీటీ గణేష్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి చేవూరు పద్మావతి, మాజీ సర్పంచి చేవూరు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చర్యలు

కావలిరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కావలి ఒకటోపట్టణ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కావలి ఎమ్మెల్యేలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన నలుగురిపై శనివారం టీడీపీ నేత జ్యోతి బాబూరావు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు ఆత్మకూరు రాజేష్, సుందరరాజు, సబ్బా ప్రభావతి, దామెర్ల శ్రావణ్‌కుమార్‌లపై కేసు నమోదు చేశామన్నారు.


రాష్ట్ర తైక్వాండోకు విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య(ఎస్‌జీఎఫ్) నిర్వహించిన జిల్లాస్థాయి తై క్వాండో పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల ఎంపికల్లో తమ పాఠశాల విద్యార్థులు 27 మంది పాల్గొని 10 స్వర్ణ, 9 వెండి, 8 కాంస్య పతకాలు సాధించారన్నారు. ఆ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎం.పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్స్ ఎనీగోవకుమార్, అరుణ, వైస్ ప్రిన్సిపాల్ సురేఖారెడ్డి, పద్మజ, కోచ్ సాగర్ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలిచెర్లపాడులో శనివారం స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశుసంవర్థక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యాధికారిణి డాక్టర్ పీ శ్రీలక్ష్మి, పశువైద్యాధికారి వీ శ్రీనివాసులునాయుడు పశువులకు పరీక్షలు చేశారు.





అదానీ కృష్ణపట్నం పోర్టుకు సస్టనెన్స్ ఆర్గనైజేషన్ అవార్డు

ముత్తుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్వాలిటీ సర్కిల్ ఆఫ్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో జరిగిన సమావేశంలో సస్టనెన్స్ ఆర్గనైజేషన్ అవార్డును అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ అందుకున్నారు. నాణ్యమైన కాన్సెప్ట్‌లపై 10వ వార్షిక కన్వెన్షన్ సమావేశంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఈ అవార్డును అందజేశారు. అలాగే అదానీ కృష్ణపట్నం పోర్టు గోల్డెన్ కేటగిరిలో నాలుగు కైజెన్, రెండు క్వాలిటీ కంట్రోల్ అవార్డులను కూడా అందుకుంది. పోర్టుకు ఈ అవార్డులు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ హెడ్ (డ్రై కార్గో) సిద్ధార్థ కుమార్ సారంగి, డీజీఎం (ప్రాజెక్టు) వివేక్ నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకున్న సీఈవో జగదీష్ పటేల్ బృందం

ఏపీ పీఆర్ డీఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక


జిల్లా పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘ నూతన కార్యవర్గం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మున్వర్ అధ్యక్షత స్థానిక అనురాగ్ లాడ్జిలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీ పీఆర్‌డీఈఏ జిల్లా అధ్యక్షుడిగా షేక్.ఖాదర్‌మస్తాన్, కార్యదర్శిగా వాసు, ఉపాధ్యక్షుడుగా డీఎస్‌హెచ్ మల్లికార్జునరావు, కోశాధికారిగా రవీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం డిపార్టుమెంట్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన కార్యవర్గం సంఘాన్ని బలోపేతం చేస్తూ ఉద్యోగులకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.శ్రీనివాసులురెడ్డి, గౌరవాధ్యక్షుడు అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రత్నప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.పరమేశ్వరలింగం, బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కాపు భవనానికి మౌలిక వసతులు : పొంగూరు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని కాపు భవన్‌కు అన్ని మౌళిక వసతులు కల్పిస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ తెలిపారు. శనివారం అధికారులు, కాపు నేతలతో కలసి ఆయన కాపు భవనాన్ని పరిశీలించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కాపు భవనంకు స్థల సేకరణకు రూ. 50 లక్షల నిధులు కేటాయించామన్నారు. కాపు భవన నిర్మాణానికి తన ఇద్దరు కుమార్తెలు చెరొక రూ.కోటి విరాళం ఇచ్చారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాపు భవనాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. దీని కారణంగా కాపు భవన్ స్థలం ఆక్రమణలకు గురైందన్నారు. సర్వే చేసి కాపు భవన్ స్థలం స్వాధీనం చేసుకోవాలని అధికారులకు సూచించారు. స్థలం ఆక్రమించిన వారిని ఇబ్బంది పెట్టకుండా అర్హులైన వారికి టిడ్కో గృహాలు ఇస్తామన్నారు. గత ప్రభుత్వం కారణంగా రాష్ట్రం రూ.10లక్షల కోట్లు లోటుతో ఉందన్నారు. బీసీ భవన్ నిర్మాణ పనులు పరిశీలించి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, కాపు నేతలు పాల్గొన్నారు.


కాపు భవన్ స్థల పత్రాలు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

15 నుంచి స్వర్ణలింగేశ్వరుడి కుంభాభిషేకం


స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ నమూనా

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని గణేష్ ఘాట్ (స్వర్ణాల చెరువు) వద్ద పునర్నిర్మించిన స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకాలు ఈనెల 15, 16, 17 తేదీలలో జరుగుతాయని బీజేపీ రాష్ట్ర నేత పి.సురేంద్రరెడ్డి తెలిపారు. ఈ ఆలయాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపావెంకట్ సహకారంతో పునర్నిర్మించామన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీశృంగేరి దక్షిణామయి శారదాపీఠం, ఉత్తర పీఠాధిపతులు విదుశేఖర భారతీ మహాస్వామి, తునితపోవనం పీఠాధిపతులు సచ్చిదానంద సరస్వతీ స్వామిల విచ్చేసి భక్తులకు ఆశీస్సులు అందజేస్తారని పేర్కొన్నారు.

సోమిరెడ్డి పేరిట పూజలు

వెంకటాచలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కంటేపల్లిలో శనివారం గిరిజనుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. సోమిరెడ్డి గిరిజనుల అభ్యున్నతికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగరాజు, సుబ్బయ్య, శ్రీహరి, రమణయ్య, రవికుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాశీఘాట్‌ను తలపించేలా గణేష్ ఘాట్

నెల్లూరు(సాంస్కృతికం)నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : సింహపురి కార్తీక లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15న జరిగే కార్తీక లక్ష దీపోత్సవానికి గణేష్ ఘాట్‌లో కాశీఘాట్‌ను తలపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఘాట్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. 15న సాయంత్రం 5గంటలకు కార్తీక దీప శోభాయాత్ర, 6గంటలకు గంగాహారతులు, అనంతరం తెప్పలతో శివాకృతి భక్తులకు కనువిందు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి, బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం జనవాణి : నూనె

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచనల మేరకు చేపట్టిన జనవాణి కార్యక్రమం పేదలకు వరం అని ఆ పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. శనివారం ఆయన నగరంలోని గోమతి నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు సుందరామిరెడ్డి, వెంకటనారాయణ, ముదిరాజ్ హరి, తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళ ఎగ్జిబిషన్ ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాభవన్‌లో శనివారం చేనేత హస్తకళ, హ్యాండ్‌ల్యూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా అమరావతి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎగ్జిబిషన్ నిర్వాహకులు బట్టు సురేష్, అండా శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో పోచంపల్లి, నారాయణపేట్, ఉప్పాడ చీరలు, మంగళగిరి, ఫ్యాన్సీ, ఖాదీ కాటన్, ప్రింటెడ్ బెంగాల్, సిల్క్, కాంతావర్క్ శారీస్, తదితర చేనేత వస్త్రాలు ఉత్పత్తి ధరలకే లభిస్తాయన్నారు.

టీడీపీలో పలువురి చేరిక


టీడీపీలో చేరిన వారితో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని చింతారెడ్డిపాళెంకు చెందిన వైసీపీ నాయకులు శనివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డిల సమక్షంలో పార్టీలో చేరారు. ఏంబేటి చిన్నబాబు, లక్ష్మయ్య, ఏసుదాసు, జనార్దన్, రూబెన్, నరసింహ, చిరంజీవి తదితరులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి సాబీర్‌ఖాన్, నాయకులు చింతా ప్రభాకర్‌రెడ్డి, తనూజ, ఏసయ్య, రాజారత్నం, ఇస్సాక్ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్‌కు జిల్లా క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న ద్వారకనాథ్

నెల్లూరు(విద్య), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపి రాణించిన జిల్లా క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ తెలిపారు. శనివారం నగరంలోని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అండర్-13 బాలికల డబుల్స్ విభాగంలో జి.లతారెడ్డి ప్రతిభ చూపి ఈనెల 27వతేదీన జమ్మూకాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. అండర్-17 రాష్ట్ర ఎస్‌జీఎఫ్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించిన జి.సుష్మారెడ్డి, పి.రేవంత్‌లు ఈనెల 17న మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించారన్నారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ బ్యాడ్మింటన్ కోచ్ వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగ సమస్య : సీపీఎం

నెల్లూరు(వైద్యం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తుందని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్ నుంచి పప్పుల వీధి, శెట్టిగుంట రోడ్డు వరకు ప్రజాపోరు ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యతో పాటు నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్య లను పక్కదారి పట్టించేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో మతపరమైన అంశాలను రెచ్చగొడుతుందన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మం పేరుతో ఆంధ్రలో రాజకీయాలు చేస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోహన్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, బీపీ నరసింహం, ఎం. ప్రసాద్ పాల్గొన్నారు.

కోటంరెడ్డికి పలువురి శుభాకాంక్షలు

నెల్లూరు(వైద్యం) (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డిని నుడా చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. దీనితో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ముందుకు ఆయన రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ నివాసానికి వెళ్లి మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పాదాలకు నమస్కారం చేసి శాలువా కప్పి, పుష్పమాల అందించారు.

● **కష్టానికి ప్రతిఫలం దక్కింది**

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పార్టీకి చేసిన సేవల వల్లే నుడా చైర్మన్‌కు పదవి దక్కిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. బాలజీనగర్‌లోని కోటంరెడ్డి ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. దీనితో ఎమ్మెల్యేను శ్రీనివాసులరెడ్డి ఆత్మీయంగా ముద్దాడారు.

● **వేమిరెడ్డి దంపతుల శుభాకాంక్షలు**

నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వీపీఆర్ నివాసానికి వచ్చిన ఆయన్ను వేమిరెడ్డి శాలువాతో సత్కరించారు.

● **సన్నపురెడ్డికి..**

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి): నెల్లూరు జోనల్ ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని శనివారం పలువురు బీజేపీ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.


ఎమ్మెల్యేకు ముద్దు పెడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

'గోకులం' ద్వారా పశుగృహ వసతి

● మండల పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎంవీ అనీల్‌కుమార్



రాపూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గోకులం పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి రైతుకి పశుగృహ వసతి కల్పిస్తామని మండల పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎంవి అనీల్‌కుమార్ తెలిపారు.

? : గోకులం (గృహవసతి) పథకం కింద రాపూరు మండలానికి ఎన్ని యూనిట్లు మంజూరయ్యాయి.

! : మండలానికి 25 యూనిట్లు మంజూరయ్యాయి. ఈ పథకానికి ఎంజీఎన్‌ఆర్‌ఎస్ పథకంలో జాబ్‌కార్డు ఉన్న వాళ్లందరూ అర్హులు.

? : పశువుల్లో వ్యాధుల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

! : మండలంలో పశువుల్లో గొంతువాపు, గొరసగాలి జబ్బు నివారణకు ప్రతి ఇంటికి సిబ్బంది వెళ్లి టీకా వేయడం జరుగుతుంది.

? : ప్రతి గ్రామంలో పశు వైద్యసేవలు అందించడానికి తగినంత సిబ్బంది ఉన్నారా.

! : ప్రతి రైతు సేవాకేంద్రంలో పశు వైద్య సహాయకులు గ్రామంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, రైతులకు సూచనలు ఇస్తారు.

న్యూస్ బాక్స్

వైభవంగా పెంచలోరి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో దేవస్థానంలో శనివారం పెంచలస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం 4గంటల స్వామి వారికి అభిషేకం, 10.30గంటలకు స్వామి వార్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నరసింహ స్వామికి తిరుచ్చి పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జొన్నవాడలో కోటి సోమవారం పూజలు


బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు9:(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో శనివారం కోటి సోమవారం సందర్భంగా మల్లికార్జునస్వామికి అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షితాయికి శ్రీచక్రనవావరణ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు వచ్చిన కోటి సోమవారం ఘడియలు శనివారం మధ్యాహ్నం 12 గంటలతో ముగిసినట్టు ఆలయ పండితులు శ్రీశైలం శశిధర్‌శర్మ తెలిపారు.

'చేతివృత్తులకు మొండిచేయి'

కోవూరు, నవంబరు9, (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు చేతివృత్తిదారుల చేతులు విరిచేశాయని రాష్ట్ర చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ గుంజి దయాకర్ అన్నారు. రెండోరోజు ప్రజాపోరు యాత్రలో భాగంగా శనివారం పాటూరు, గుమ్మళ్లదిబ్బ, పల్లిపాలెం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 56 రకాల చేతివృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. 50 ఏళ్లు పైబడిన బీసీలందరికీ పింఛన్ చెల్లించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, పెద్దబ్బయ్య, రమేష్, శ్రీనివాసులు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

విడవలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి తెలిపారు. మండలంలోని పరిణి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 910-1లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవాలని శనివారం ఎక్స్‌కవేటర్‌తో చెట్లను తొలగించారు. స్పందించిన తహసీల్దారు స్థానిక వీఆర్వో దుర్గాప్రసాద్‌ని సంఘటనా స్థలానికి పంపి చెట్ల తొలగింపును నిలిపివేయించారు. ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా ఎలాంటి పనులు చేయకూడదన్నారు. అలా ఎవరైనాచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





కళా విన్యాసం

ఎస్వీయూలో యువ తరంగ్-2024 జోరుగా హుషారుగా సాగుతోంది. రెండో రోజైన శనివారం కళాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. సమాంతర వేదికల్లో నిర్వహించిన కళా విన్యాసాలను న్యాయ నిర్ణేతలు తిలకించారు. నేటితో కార్యక్రమం ముగియనుంది.

అలంకార ప్రియుడికి పుష్పార్చన

తిరుమల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు.పుష్పయాగానికి అవసరమైన పూలకు తిరుమలలోని గార్డెన్‌లో ప్రత్యేక పూజలు చేసి శ్రీవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాభరణాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల పాటు 17 రకాల పుష్పాలు, ఆరు రకాల పత్రాలతో నివేదిన అర్పించారు. అంతకు ముందు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించాక నక్షత్ర హారతి, కుంభ హారతి, ప్రత్యేక హారతి సమర్పించారు.టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఉద్యానవనం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ సేవలకు అందలం

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదుగురు టీడీపీ నాయకులకు కీలక పదవులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాను శనివారం ప్రకటించింది. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదుగురికి కీలక పదవులు లభించాయి. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) ఛైర్‌పర్సన్‌గా మాజీ మేయర్ కటారి హేమలతను నియమించారు.చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌కు వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారు.యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్‌ను ఎంపిక చేశారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం నియమితులయ్యారు. ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాళెం విజయకుమార్‌ను నియమించారు.

- చిత్తూరు/తిరుపతి, ఆంధ్రజ్యోతి



టీడీపీతో సుదీర్ఘ అనుబంధం

యాదవ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నరసింహ యాదవ్ కుటుంబం సుదీర్ఘంగా టీడీపీలో ఉంది.2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు తుడా ఛైర్మన్‌గా నరసింహ యాదవ్‌కు అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత 2019లో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడిగా నియమించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీ, తుడాపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. మూడు పార్టీల మధ్య సర్దుబాటు క్లిష్టంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం మాత్రం నరసింహ యాదవ్‌కు న్యాయం చేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తుడాపై కొనసాగుతున్న ఉత్కంఠ

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఛైర్మన్ నియామకంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. రెండోదశ నామినేటెడ్ పదవుల జాబితాలో తుడా లేకపోవడం చర్చనీయాంశమైంది.తాజా జాబితాలో తమ పేరుంటుందని భావించిన ఆశావహులకు నిరాశే ఎదురైంది. తుడా ఛైర్మన్ రేసులో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్‌లతో పాటు డాలర్స్ దివాకర రెడ్డి, శ్రీధర్ వర్మ, కాంట్రాక్టర్ శంకర్ రెడ్డి పేర్లు వినిపించాయి. యాదవ కార్పొరేషన్ పదవికి నరసింహ యాదవ్ భర్తీ కావడంతో మిగిలినవారి పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లో తుడా ఉత్కంఠకు తెరదించే పనిలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.



ఇచ్చిన మాట ప్రకారం

తిరుచానూరుకు చెందిన సీఆర్ రాజన్ గతంలో సర్పంచిగా పనిచేశారు. వన్నియ కుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఆయన చిత్తూరు అసెంబ్లీ టికెట్ కోసం పోటీపడ్డారు.చిత్తూరులో కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.అందరితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. గురజాల జగన్మోహన్‌కు టికెట్ దక్కడంతో ఆయన నిరాశ చెందారు. దీంతో ఆయనకు పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడిగా అవకాశం కల్పించింది. ఆయన కూడా గురజాలతో కలిసి పనిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజున చిత్తూరు మురకంబట్టుకు వచ్చిన చంద్రబాబు 'కొన్ని కారణాలతో సీఆర్ రాజన్‌కు టికెట్ ఇవ్వలేకపోయాం. పార్టీ వచ్చాక సముచిత స్థానం కల్పిస్తాం'అని ప్రకటించారు. దీంతో రాజన్‌కు సముచిత స్థానం లభించింది. వన్నియకుల క్షత్రియ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమించారు.

సముచిత స్థానం



చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత.. తొలి విడత నామినేటెడ్ పోస్టుల జాబితాలో టూరిజం డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చారు. అయితే అది ఆమెకు తగిన పదవి కాదని పార్టీ వర్గాలతో పాటు ఆమె అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమైంది.ఆమె మాత్రం పార్టీ మీద గౌరవం, నమ్మకంతో తన అసంతృప్తిని ఎక్కడా బయటపెట్టలేదు.చంద్రబాబును కలిసి మరోసారి పరిశీలించాలని కోరడంతో రెండో జాబితాలో ఆమెకు చుడా ఛైర్‌పర్సన్‌గా అవకాశం లభించింది.2016లో తన అత్త కటారి అనురాధ, ఆమె భర్త మోహన్ హత్యకు గురైన తర్వాత మేయర్ అయిన హేమలత పాలనలో తనదైన ముద్ర వేశారు. 2019లో పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. వైసీపీ అక్రమాల్ని ప్రశ్నించడంతో అక్రమ కేసుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కరోనా సమయంలో భర్త ప్రవీణ్‌ను కోల్పోయాక ఒంటరిగా పార్టీకోసం పోరాడుతూ వచ్చారు. ఆరుగురు ఎమ్మెల్యే టికెట్ ఆశావహుల్లో ఆమె కూడా ఉండి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురజాల జగన్మోహన్‌కు టికెట్ వచ్చినా.. ఆయన గెలుపు కోసం శ్రమించారు.

జయహో బీసీతో గుర్తింపు



ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన రుద్రకోటి సదాశివం పార్టీలో అనేక బాధ్యతలను నిర్వహించారు. టీడీపీ జిల్లా బీసీ సెల్ ప్రచార కార్యదర్శిగా, టీఎన్‌టీయూసీ నాయకుడిగా, నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2022 నుంచి తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వీటితో పాటు వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం తిరుపతి అధ్యక్షుడిగా, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా డిప్యూటీ గవర్నర్‌గా ఉన్నారు. జిల్లావ్యాప్తంగా జయహో బీసీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి అధిష్ఠానం వద్ద గుర్తింపు తెచ్చుకున్నారు.

టీడీపీ స్వరం



మీడియా వేదికగా టీడీపీ స్వరం ధాటీగా వినిపించే నీలాయపాళెం విజయకుమార్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ పదవి లభించింది. ఈయన ఎస్వీ యూనివర్సిటీలో ఎకనామెట్రిక్స్‌లో ఎంఫిల్ చేశారు. కార్పొరేట్ కంపెనీల్లో కీలక బాధ్యతల్లో ఉంటూ రాజకీయాల్లోకి వచ్చారు. పదిహేనేళ్లుగా టీడీపీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు.ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

8 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

● తిరుపతి జిల్లా నుంచే ఎక్కువమంది ఎంపిక



సురేష్ - మంజువాణి - సుబ్రహ్మణ్యం - కామాక్షయ్య



యామిని - ప్రభాకర్‌రావు - ఆనంద్ - బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నుంచి ఎనిమిది మంది ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యాబోధన, నిర్వహణకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ ఏటా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులతో గౌరవిస్తోంది. ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులు అవార్డులు గెలుచుకున్నారు.

వారి వివరాలు ఇలా..

ఏర్పేడు మండలం, పల్లం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్ ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా అవార్డు అందుకోనున్నారు తొట్టంబేడు మండలం, దిగువ సాంబయ్యపాలెం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ కె.బాలసుబ్రహ్మణ్యం, చంద్రగిరి మండలం రంగంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, ఏర్పేడు మండలం బండార్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఎం.సుబ్రహ్మణ్యం, పిచ్చాటూరు మండలం,రాజానగరం జిల్లా పరిషత్ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయులు వి.కామాక్షయ్య,తిరుపతి జిల్లా దొరవారిసత్రం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) పీజీటీ బి.యామిని, కేవీబీపురం కేజీబీవీ క్రాఫ్ట్ టీచర్ ఆర్.మంజువాణి, శ్రీకాళహస్తి మండలం జడ్పీ హైస్కూల్ సోషల్ స్టడీస్ టీచర్ సురేష్ కునాటి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. సురేష్ ఇటీవల జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. వీరు ఆదివారం విజయవాడ లబ్బీపేటలోని ఎ-కన్వెన్షన్ హాల్లో జరుగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డులను అందుకోనున్నారు.

రూ.కోట్లు కూడేసి ఏసీబీకి దొరికేశాడు

● మాజీ ఆర్డీవో మురళి ఆస్తులపై విస్తృత సోదాలు ● కీలక డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి):ఆదినుంచీ వివాదాస్పద అధికారిగా పేరుబడ్డ డిప్యూటీ కలెక్టర్ మద్దాల సాకపు మురళి అనతి కాలంలోనే కోట్లు వెనకేసుకున్నాడని ఏసీబీ గుర్తించింది.2022లో మదనపల్లెకు ఆర్డీవోగా వచ్చిన మురళికి 2024 జనవరి 17న తహసీల్దారుగా ప్రభుత్వం రివర్షన్ ఇచ్చింది. గతంలో ప్రకాశం జిల్లాలో ఆర్డీవోగా పనిచేసిన సమయంలో సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో సర్వే నంబరు 344లో ఒంగోలు ఛారిటబుల్ సదావర్తి మఠానికి చెందిన ఇనాం భూములను అక్రమంగా ఇతరులకు కట్టబెట్టారన్న ఆరోపణలకు గురయ్యారు. సంబంధిత సర్వే నంబరులో 66.25 ఎకరాలను ఇతరులకు పట్టాలు కేటాయించి, పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై మఠం ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి జేసీ-2 విచారణ జరిపి ఆరోపణలు వాస్తవమని తేల్చి ప్రభుత్వానికి నివేదించారు. దానిపై ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 17న ఆయనకు తహసీల్దారుగా రివర్షన్ ఇచ్చింది. కానీ అప్పటి ప్రభుత్వంలో కీలక నేతల మద్దతుతో కొంతకాలానికే ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల ఆలయ ఈవోగా పోస్టింగు సంపాదించారు. నెల తరువాత తిరుపతి కలెక్టరేట్‌లో లీగల్‌సెల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. తరువాత మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ ఫైళ్ల దగ్ధం కేసులో ప్రభుత్వం మురళిని సస్పెండ్ చేసింది.ఈ నేపథ్యంలో పలుచోట్ల ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడని ఏసీబీ డీజీపీకి అందిన ఫిర్యాదుతో కడప, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లోని దాదాపు 65 ప్రాంతాల్లో ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏఎస్పీ విమలకుమారి పర్యవేక్షణలో దాదాపు 13 బృందాలు శనివారం ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. మురళీని ఏసీబీ అధికారులు తిరుపతిలోని అతని ఇంటి వద్ద శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నాక సోదాలు ప్రారంభించారు. శనివారం రాత్రి వరకు అందిన సమాచారం మేరకు తిరుపతి ఓటేరులోని ఎల్ఎస్‌కే రెసిడెన్సీలోని మురళీ ఇల్లు, ఎంకే నాయుడు కాలనీలోని ఎవర్ గ్రీన్ అపార్టుమెంటులో ఫ్లాట్ నెంబరు 202లో ఆయన కుమారుడు లీలా సాయికృష్ణ, బైరాగిపట్టెడలోని స్నేహితుడు డిప్యూటీ తహసిల్దార్ శేషగిరి, విద్యానగర్ కాలనీలోని సర్వేయర్ చిట్టిబాబు ఇళ్లలో సోదాలు జరిగాయి. తిరుపతి సమీపంలోని తనపల్లి క్రాస్ వద్ద కుమారుడి పేరుతో వున్న సాయి గ్రాండ్ హోటల్‌లో సోదాలు చేస్తున్న ఏసీబీ బృందానికి పలు కీలక రికార్డులు దొరికినట్లు సమాచారం. వీటితో పాటు భారీ ఎత్తున ఆస్తులు కొనుగోలు చేసి బినామీ పేర్లతో వుంచిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిలో ఇప్పటి వరకు జరిగిన సోదాల్లో 50 సవర్ల బంగారు నగలు, వెండి వస్తువులు, లక్షలాది రూపాయల డబ్బు సీజ్ చేసినట్లు సమాచారం. బైరాగిపట్టెడలోని డిప్యూటీ తహసిల్దార్ ఇంటిలో కొన్ని కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. సర్వేయర్ చిట్టిబాబు ఇంటిలో మురళి పేరుతో బ్యాంకు లావాదేవీల పత్రాలు వున్నట్లు తెలిసింది.తిరుపతి పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ప్లాట్లు వేసి విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. మురళి వి.కోటవాసి కావడంతో అక్కడ రెండు పౌల్ట్రీఫారాలు, భూములు, ప్లాట్లు వున్నట్లు గుర్తించి అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు సమీపంలోని కీలపట్లలో గుర్రప్ప పేరుతో వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన పత్రాలు సీజ్ చేశారు. అక్కడ మురళి బంధువుల ఇళ్లలోనూ సోదాలు జరిపారు. పుంగనూరులో పీడీగా పనిచేసిన కాలంలో చుట్టుపక్కల గ్రామాల్లో ఆస్తులు కూడబెట్టాడనే ఆరోపణలున్నాయి. వైసీపీ హయాంలో జిల్లాకు చెందిన ఒక మంత్రి మద్దతుతో పలు ప్రాంతాల్లో అత్యంత విలువైన ఆస్తులు, భూములు, ఇళ్ళు, ప్లాట్లు కొనుగోలు చేసి బంధువులు, స్నేహితుల పేర్ల మీద వుంచినట్లు తెలియడంతో ఆ దిశగానూ అధికారులు సోదాలు చేస్తున్నారు. సోదాలు ఆదివారం కూడా కొనసాగనున్నాయి. మురళీతో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు సంబంధించిన బ్యాంకు లాకర్లపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు.



తిరుపతిలోని బైరాగిపట్టెడలో మురళీ కుమారుడి ఇంట్లో ఏసీబీ తనిఖీలు

హౌసింగ్ అవకతవకలపై చర్యలుంటాయి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం, కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని, దీనిపై జేసీతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా హౌసింగ్ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ లే అవుట్లలో ఇంటి పట్టాలు చేతులు మారడం, కొన్ని ఇళ్ల నిర్మాణం జరగకపోయినా ప్రభుత్వం నుంచి సొమ్ము డ్రా చేయడం వంటివి జరిగాయని, ఎమ్మెల్యేల ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించామని చెప్పారు. నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి రాష్ట్రంలో లక్ష ఇళ్లు పూర్తి చేసి, లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. పీఎంఏవై 1.0లో రెండు జిల్లాలకు మంజూరైన గృహాలు 50 శాతం పూర్తయ్యాయని, పలు నియోజకవర్గాల్లో 70శాతం పూర్తయ్యాయని, కొన్నిచోట్ల ఇసుక సమస్య కారణంగా గృహ నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. హౌసింగ్ నిర్మాణానికి ఇసుక ఇవ్వాలని అధికారులకు సూచించామన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు బిల్లు సమర్పించిన వారంలోపే ఖాతాల్లో డబ్బులు పడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన చూడలేకే వైసీపీ సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తోందన్నారు. సమాచార శాఖ అధికారి భూ కుంభకోణానికి పాల్పడ్డాడని మీడియా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకురాగా భూములను ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ పలు సమస్యలను, అవినీతి ఆరోపణలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, డీఆర్వో నరసింహులు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, హౌసింగ్ సీఈ ప్రసాద్, ఎస్ఈ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

విమానాశ్రయంలో మాక్‌డ్రిల్




మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్, సీఐఎస్ఎఫ్, పోలీసు బృందాలు

రేణిగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి ఇటీవల వరుసగా బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం శనివారం తెల్లవారుజామున 1.30గంటలకు ఆక్టోపస్, సీఐఎస్ఎఫ్, పోలీసులు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. విమానాశ్రయంలోకి ప్రయాణికుల ముసుగులో తీవ్రవాదులు ప్రవేశిస్తే ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై డ్రిల్ చేశారు. అదే సమయంలో విస్ఫోటనాలు జరిగితే ప్రాణనష్ట నివారణకు తీసుకోవాల్సిన అంశాలపైనా మాక్‌డ్రిల్ చేశారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణబాబు, సీఐ రాంబాబు, సీఐఎస్ఎఫ్ కమాండంట్ శుక్ల, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు

తిరుమల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 64,983 మంది భక్తులు దర్శించుకున్నారు. 25,324 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో హీరో నిఖిల్...



సినీ యువ హీరో నిఖిల్ శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వచ్చిన నిఖిల్‌ను చూసేందుకు పలువురు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కళ్యాణ వైభోగమే

ఆకాశం దిగివచ్చి మబ్బులతో వెయ్యాలి మన పందిరి..ఊరంతా చెప్పుకునే ముచ్చటగా సాగాలి పెళ్లంటే మరి..

అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ సినిమాపాటలో. ఎవరెన్ని చెప్పినా పెళ్లంటే సందడికి ప్రత్యామ్నాయమే. అందుకే పెళ్లి అనగానే ఎంత హడావుడి పడుతుంటారో. ఇదంతా ఒక సంగతయితే కొన్ని రోజులుగా పెళ్లి సందడి కనిపించడం లేదు. కారణం ముహూర్తాలు లేకపోవడమే. మూడు నెలలపాటు మూఢం రావడంతో శుభ కార్యాలయాలకు సెంటిమెంటు అడ్డొచ్చింది. ఆశ్వయుజ మాసంలో కొన్ని ముహూర్తాలున్నా చాలామంది దీపావళి తర్వాత వచ్చే కార్తీకమాసం ముహూర్తాలపైనే ఆసక్తి చూపుతున్నారు. మార్గశిర మాసంలో కూడా మంచి బలమైన ముహూర్తాలున్నాయని పురోహితులు చెబుతున్నారు. దీంతో వధూవరుల తల్లిదండ్రులు ఈ రెండు నెలల ముహూర్తాల్లోనే వివాహం చేయాలని సిద్ధపడుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



మోగనున్న పెళ్లి భాజాలు

ఈ రెండు నెలల్లో ఎక్కువ శుభ ముహూర్తాలు

ఇప్పటికే బుక్ అయిన కళ్యాణ మండపాలు

పురోహితుల నుంచి ఫొటోగ్రాఫర్ల వరకూ డిమాండ్

ఇప్పుడు కాకుంటే మాఘం వరకూ ఆగాల్సిందే..

పెళ్లిళ్లకే కాదు వివిధ ఉపనయనాలు, గృహ ప్రవేశాలు లాంటి శుభ కార్యక్రమాలకూ ఈనెల 10 నుంచి 28వరకూ, అలాగే డిసెంబరు 4 నుంచి 16వ తేదీ వరకు అంటే సుముహూర్తాలు ఉన్నాయి. ఈ ముహూర్తాల తర్వాత మాఘమాసం వరకూ ఆగాల్సిందే. అందుకే అందరూ త్వరపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూఢంలో ముహూర్తాలు లేక దిగాలు పడిన వారందరిలో ఇప్పుడు జోష్ కనిపిస్తోంది. వివాహ సంబంధ వ్యవహారాలతో ముడిపడినవారంతా బిజీబిజీగా కనిపిస్తున్నారు. కళ్యాణ వేదికలకు చాలా డిమాండ్ ఏర్పడింది. ఈమధ్యనే పెళ్లి కుదుర్చుకున్న వారు వేదిక దొరక్క దూరంగా వెళ్లయినా చేయాలనుకుంటున్నారు.

అందరూ బిజీబిజీ

గతంలో పెళ్లంటే హంగూ ఆర్భాటం ఉండేది కాదు. ఇప్పుడు అన్ని వర్గాలవారూ వివాహం అందరూ గుర్తుంచుకునేలా చేయాలని ఆరాటపడుతున్నారు. ఇందుకోసం ఎంతయినా వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు,భాజా భజంత్రీలవారు,కేటరింగ్, బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, షామియానా,కుర్చీలు సప్లయర్స్, ఆకర్షణీయ డెకరేటర్లు ఒకరేమిటి ఇలా చాలామంది వెంటపడాల్సి వస్తోంది. ఈ శ్రమ లేకుండా తామే అన్ని చూసుకుంటామంటూ ఈవెంట్ మేనేజర్లు పుట్టుకొచ్చారు. శుభ కార్యక్రమాలకు దివ్యమైన ముహూర్తాలు దగ్గర పడుతుండటంతో వీరందరికీ గిరాకీ ఏర్పడింది. రానున్న ముహూర్తాల్లో దాదాపు 10వేలకు పైగా పెళ్ళిళ్లు జరగనున్నాయని అంచనా.

తిరుపతిలో కళ్యాణ మండపాలకు డిమాండ్

తిరుపతిలో పెళ్లి చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి కనపరుస్తున్నారు. ఇప్పటికే టీటీడీ కళ్యాణ మండపాలతో పాటు ప్రయివేటు, కార్పొరేట్, చిన్నా చితకా మండపాలు, మాల్స్ అన్నీ బుక్ అయిపోయాయని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని మండపాల నిర్వాహకులు పెళ్ళి చేసే వారికి ఇబ్బంది లేకుండా కేటరింగ్, బ్యాండు మేళాలు, భోజనాలు, డెకరేషన్, పురోహితులు, ఇలా సర్వం ప్యాకేజీ రూపంలో ఏర్పాటు చేస్తున్నారు. మండపాల స్థాయిని బట్టి రూ.60 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. మరోపక్క బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో సందడి సందడిగా కనిపిస్తున్నాయి. బట్టల షాపులూ రద్దీగానే ఉన్నాయి. నాణ్యత, మన్నికలను బట్టి పట్టుచీరలకు రేట్లు వసూలు చేస్తున్నారు. కనీసం రూ.5వేల నుంచి రూ.5లక్షల వరకు పట్టుచీరల ధరలు పలుకుతున్నాయి.

శుభ ముహూర్తాలు ఇవీ....

ఈనెల నుంచి మార్చి వరకు వివాహాది శుభ కార్యాలకు ముహూర్తాలున్నాయి.

ఈ నెలలో 10,14,16,17,20,22,27,28 తేదీలు

డిసెంబరు: 4,5,6,7,8,11,12,14,15,19,20,21,26,27,28

జనవరి : 31వ తేదీ మాత్రమే

ఫిబ్రవరి: 2,6,7,8,9,12,13,14,15,16,21,22,23,26

మార్చి: 2,6,9,12,15,16.

వివాహాలకు అనుకూలం

నవంబరు, డిసెంబరు నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. భాద్రపద మాసంలో వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు లేవు.. డిసెంబరు నెలాఖరు వరకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. మంచి రోజుల్లో శుభకార్యాలు చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే విశేష ముహూర్తాలకు అంత బలం.

-సత్యనారాయణ మూర్తి, పురోహితులు

ధరలతో ఆందోళన

ఐదారు సంవత్సరాలతో పోలిస్తే క్యాటరింగ్ సంస్థలు పెరిగాయి. ప్రస్తుతం నిత్యావసర వస్తువులు, ఆయిల్, బియ్యం, పప్పుల ధరలు దారుణంగా ఉన్నాయి. గతంలో ధరలకు భోజనం సమకూర్చాలంటే కష్టమే. ఇదే భయం మమ్మల్ని వెంటాడుతోంది. ఎలా ఉన్నా ఈ రెండు నెలలూ క్యాటరింగ్ నిర్వాహకులకు చేతినిండా పని ఉంటుంది

-కృష్ణమూర్తి, ఎస్‌కే క్యాటరింగ్, తిరుపతి

ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్నబాబు



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనపాకం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చిన్నబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఎన్నికల అధికారి సురేష్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్ జనరల్ సెక్రటరీగా శంకరప్ప, జాయింట్ సెక్రటరీగా రెహానా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మధులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల సమస్యలను ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి దుర్మరణం



వీరాంజనేయులు (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. బాపట్లకు చెందిన ముత్యాల వీరాంజనేయులు(50) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. బాపట్ల జిల్లాకు చెందిన అతని స్నేహితులు రంగారావు(52), గంధం కృష్ణమూర్తి(53)తో కలిసి కారులో బెంగళూరుకు శుక్రవారం బయలుదేరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై ఓ లారీ మరమ్మతులకు గురికావడంతో రోడ్డుపక్కన నిలిపివేశారు. శనివారం వేకువజామున 2గంటల ప్రాంతంలో బెంగళూరు వైపుగా వెళుతున్న వీరి కారు ఆగివున్న లారీని ఢీకొంది. వాహనం నడుపుతున్న వీరాంజనేయులు, రంగారావు, కృష్ణమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరాంజనేయులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. వీరాంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీఎఫ్ నిధులు స్వాహా

మ్యాన్ పవర్ ఏజెన్సీపై కార్మికుల ఫిర్యాదు

సత్యవేడు, నవంబరు 9: కార్మికులు కాయ కష్టం చేసి దాచుకున్న పీఎఫ్ సొమ్మును ఓ మ్యాన్ పవర్ ఏజెన్సీ స్వాహా చేసింది. దీంతో కార్మికులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శ్రీసిటీ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీసిటీ పరిధిలోని ఐఎఫ్ఎఫ్ పరిశ్రమలో కొంత మంది కార్మికులు తమిళనాడుకు చెందిన వీపీజీ అనే మ్యాన్ పవర్ ఏజెన్సీ కింద పని చేస్తున్నారు. తమ వేతనం డబ్బుల నుంచి పొదుపు చేసుకున్న పీఎఫ్ నగదును దిగమింగేశారని పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు శనివారం శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2023కు సంబంధించిన పీఎఫ్ సొమ్ముతో పాటు, తమకు రావాల్సిన బోనస్ నగదును స్వాహా చేసేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు రూ.20 లక్షలకు పైగా కార్మికుల పీఎఫ్, బోనస్ డబ్బులు కాజేశారని సమాచారం. ఈ వ్యవహారంలో పరిశ్రమలో కీలక విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు రావాల్సిన పీఎఫ్, బోనస్ నగదును తమ ఖాతాల్లో జమ చేసి న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

పుత్తూరులో నకిలీ నోట్ల కలకలం

- రూ.30 వేల రూ.500 నకిలీనోట్ల చలామణి
- తండ్రీకూతుళ్లు నిందితులు
- పోలీసులకు అప్పగించిన స్థానికులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 09(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో నకిలీ నోట్ల చలామణి కలకలం సృష్టించింది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో నకిలీ నోట్ల చలామణి చేస్తున్న తండ్రీకూతుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15 వేల వరకు రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పుత్తూరులో బిజీబిజీగా ఉండే బజారు వీధి తదితర ప్రాంతాల్లోని చిల్లర దుకాణాలే లక్ష్యంగా నకిలీ నోట్ల మార్పునకు వీరు శ్రీకారం చుట్టారు. బాధితుల కథనం మేరకు.. ఓ ఫైనాన్సర్ దుకాణాల నుంచి రోజువారీ ఫైనాన్స్ నగదును కలెక్షన్ చేసుకుని తన వద్ద ఉన్న లెక్కింపు మిషన్‌తో లెక్కించారు. వాటిలో రూ.500 నోట్లు నకిలీవిగా గుర్తించారు. అప్రమత్తమైన ఫైనాన్సర్ సదరు దుకాణదారులకు సమాచారం అందించారు. అప్పటికే పలు దుకాణాలలో దాదాపు రూ.30 వేలకు పైగా రూ.500 నకిలీ నోట్లను తండ్రీ, కూతురు మార్పు చేశారు. రూ.50లకు చిన్నపాటి సరుకులు కొనుగోలు చేసి రూ.450 నగదును తిరిగి పొందేవారని గుర్తించారు. ఫైనాన్సర్ సమాచారంతో దుకాణదారులందరూ ఏకమై వారి కోసం జల్లెడపట్టారు. పుత్తూరు పోలీస్ స్టేషన్ ఎదుట వెళుతున్న వారిని గుర్తించి కానిస్టేబుల్ మురళికి సమాచారం ఇచ్చారు. వారిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితులు వద్ద ఉన్న నకిలీ రూ.500ల నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తిరుచానూరులో కాపురం ఉన్నట్లు వెల్లడైంది. తిరుపతిలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ నకిలీ నోట్లను పొందినట్లు విచారణలో తేలింది. దీంతో అసలు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని సీఐ సురేంద్రనాయుడు వెల్లడించారు.

రోడ్డుప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం



మునీంద్ర(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరం గ్రామానికి చెందిన మునీంద్ర(35) ఆటో డ్రైవర్. ఊరందూరు వద్ద జాతీయ రహదారిపై ఆటోలో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మునీంద్ర అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఊరందూరు వద్ద మృతదేహాన్ని సుమారు మూడు గంటల పాటు అక్కడే ఉంచేశారు. మృతదేహాన్ని తరలించడంలో జాప్యం జరగడంపై ఉన్నతాధికారులు శ్రీకాళహస్తి రూరల్‌పోలీసులను మంద లించినట్లు సమాచారం.

ముక్కంటి ఆలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



రమేష్‌రాజు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి చెందిన ఒప్పంద ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించాడు. విధులకు అనధికారికంగా గైర్హాజరు అవుతున్నాడని రమేష్‌రాజు అనే ఒప్పంద ఉద్యోగిని అధికారులు నెల రోజుల క్రితం సస్పెండ్ చేశారు. అయితే తనను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు స్పందించడంలేదని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్యూటీ లేక కుటుంబ పోషణ భారం కావడంతో ఆత్మహత్యకు యత్నించినట్లు రమేష్‌రాజు వాపోయాడు.

వెటర్నరీవర్సిటీలో అధ్యాపకుల బదిలీలు

తిరుపతిరూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఏపీరాష్ట్రంలో తిరుపతికేంద్రంగా నడిచే ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలో అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్‌లో భాగంగా పలువురు ప్రొఫెసర్లు, సెంటిస్టులు, అధ్యాపకులకు బదిలీలు చేపట్టారు. తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ, ప్రొద్దుటూరులోని వెటర్నరీ కాలేజ్, గన్నవరంలోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, వెంకట్రామన్నగూడెం, విశాఖపట్నం, రామచంద్రాపురం, వెన్నెలవలస, గుంటూరు కేవీకేలో పనిచేసే దాదాపు 26మందిని గిరివిడికి బదిలీ చేస్తూ శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శనివారం పలువురు రిలీవ్ అయినట్లు తెలిసింది.

రేపు జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ జాబ్‌మేళాలో పలు బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్సు, బయోడేటా ఫాంతో సంబంధిత లింక్‌లో నమోదు చేసుకుని, అడ్మిట్ కార్డుతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8555972657ను సంప్రదించాలని తెలిపారు.

క్రీడా రంగానికి పూర్వవైభవం : శాప్ చైర్మన్



పోటీలను తిలకిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడా రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. శనివారం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఫస్ట్ ఓపెన్ సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రవినాయుడు మాట్లాడుతూ తిరుపతిని క్రీడా వేదికగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న క్రీడా వేదికలను డీఎస్ఏ(డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ)ఆధీనంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2027లో రాష్ట్రంలో నేషనల్స్ గేమ్స్ నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, తొలి రోజు అండర్ 12 వ్యక్తిగత కట, కుమితే విభాగాలలో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టీడీపీ సీనియర్ నాయకులు వూకా విజయకుమార్, మబ్బు దేవనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలు

రేణిగుంట, నవంబరు9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-17, 19 ఘట్కా క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి విశ్వనాథ్‌నాయక్, స్టేట్ పర్యవేక్షణ అధికారి బాలశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 150మంది క్రీడాకారులు, 30 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరయ్యారు. అందరికీ భోజన వసతి కల్పిస్తున్నట్లు హెచ్ఎం విష్ణువర్ధని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఘట్కా కార్యదర్శి సురేంద్ర, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రేఖరాణి తదితరులు పాల్గొన్నారు.



ఘట్కా పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

మా భూములు మాకు అప్పగించండి



కళత్తూరులో టవర్ ఎక్కిన దళిత రైతులు

- టవర్ ఎక్కిన కళత్తూరు దళిత రైతులు



గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

కేవీబీపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూముల్లోకి వెళ్లకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారంటూ మండలంలోని కళత్తూరు దళిత రైతులు శనివారం ఉదయం సెల్ టవర్ ఎక్కారు. వారు మాట్లాడుతూ కళత్తూరు రెవెన్యూ బ్లాక్ నెంబరు.4 లోని భూములను కొన్నేళ్లగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. పది సంవత్సరాల నుంచి అటవీ, రెవెన్యూ అధికారులు ఈ భూములు తమవంటే తమవంటూ అడ్డంకులు కల్పిస్తున్నారన్నారు. రెవెన్యూ వారు ఏకంగా ఆ భూముల్లో కొంతమందికి పట్టాలు సైతం ఇచ్చారని తెలిపారు. ఇటీవల ఆ భూముల్లోకి ప్రవేశించిన రైతులపై అటవీ శాఖ వారు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేసేవరకు దిగేది లేదని తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి తహసీల్దారు భానుప్రకాష్‌రెడ్డి, పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, పిచ్చాటూరు ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను కిందకు దించడానికి ప్రయత్నించారు. వారు ససేమిరా అనడంతో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఎఫ్ఆర్వో రాధికారెడ్డి, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశ్వర్లు వంద రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో దిగి వచ్చారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను ఎవరూ అడ్డుకోరని చెప్పడంతో శాంతించారు. కార్యక్రమంలో తహసీల్దారు మునిరత్నంరెడ్డి, పోలీసు సిబ్బంది అమరనాథనాయుడు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అర్హులందరికీ గృహాలు మంజూరు చేయండి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే విజశ్రీ

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతిలో జరిగిన గృహనిర్మాణ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తడ మండలం రామాపురం పంచాయతీలో గత ప్రభుత్వం హయాంలో దాదాపు 300 ఇళ్లు పైగా నిర్మించు కొనేందుకు లబ్ధిదారులు ముందుకొచ్చినా, మంజూరు చేయలేదన్నారు. వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నతి



విద్యార్థికి మెమెంటో, నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థి, ప్రిన్సిపాల్

కోట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో మెలిగితే భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవచ్చని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు అన్నారు. కోటలోని బీసీ బాలుర గురుకులంలో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. 2005లో ఇక్కడి గురుకులంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు అప్పటి గురువులను సన్మానించి ఆశీర్వాదం పొందారు. అదే విధంగా 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ టాపర్లకు రూ.10,116, రూ.5,116 నగదు ప్రోత్సాహకాలు, మెమొంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అప్పటి ప్రిన్సిపాళ్లు మహబూబ్‌బాషా, నీలకంఠం, కోటారెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నేపాల్‌వాసి మృతి



మృతి చెందిన దమ్మరే పరియార్

తడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నేపాల్‌వాసి మృతి చెందాడు. నేపాల్ దేశం మత్తపురేచ్చే జాతలిక గ్రామానికి చెందిన దమ్మరే పరియార్(53) పూడికుప్పం జాతీయ రహదారి వద్ద షాపులో పని చేస్తుంటాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తాను పనిచేసే షాపు నుంచి బయటకువచ్చి అవతలి వైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దమ్మరే పరియార్ తీవ్రంగా గాయపడడంతో వెంటనే సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోటి సోమవార వేడుకలు



దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు - పుష్పాలంకరణలో శివుడు

సూళ్లూరుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం కోటి సోమవార పూజలను నాగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి దీపాలు పెట్టి పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రధాన అర్చకులు సునీల్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నెక్సస్ వర్క్-2.0 జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులు సాంకేతిక రంగంలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం ఉంటుందని విజయ కుమార్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ హరినాథ్‌రెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందుతామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ధ్యాన సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు ఏదో ఒక సమస్యతో ఒత్తిడికి లోనై అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంత పెరిగి ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవాటు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, గోపినాథ్, నల్లస్వామి, రాఘవేంద్ర పాల్గొన్నారు.



ధ్యానం చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సంస్థ ప్రతినిధులు

అష్ట దేవాలయాల సందర్శనకు ప్రత్యేక బస్సులు

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ప్రతి సోమవారం అష్టదేవాలయాల సందర్శన యాత్ర కోసం ప్రత్యేక బస్సులు నడుతున్నట్లు సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 4:30 గంటలకు సూళ్లూరుపేట బస్టాండు నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. సురుటుపల్లి, నాగలాపురం, కైలాసకోన, నారాయణవనం, ముక్కోటి, శ్రీనివాసమంగాపురం, కపిలతీర్థం, శ్రీకాళహస్తి అష్ట దేవాలయాల సందర్శన అనంతరం రాత్రి9:30 గంటలకు సూళ్లూరుపేటకు చేరు కుంటుందని డీఎం పేర్కొన్నారు. భక్తులు ముందుగా రిజర్వేషన్ చేసుకోవడంతో పాటు బస్సులో కూడా టికెట్లను తీసుకోవచ్చునన్నారు.

వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ వెంకటరమణయ్య(26) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... మండలంలోని తన్నమాల గ్రామానికి చెందిన వెంకట రమణయ్య ఆటోలో గూడూరు వైపు వెళ్తుండగా తుమ్మూరు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణాపురం గిరిజనకాలనీ, ఏరూరు అల్లీపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ అద్దె భవనాలు

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

వసతులు లేక విద్యార్థులు, సిబ్బంది అవస్థలు

చిల్లకూరు, నవంబరు 9: చిల్లకూరు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వాటిల్లో అరకొర వసతులు ఉండడంతో చిన్నారులతో పాటు సిబ్బందికీ ఇబ్బందులు తప్పడంలేదు. మండలంలోని 74 అంగన్‌వాడీలు, 11 మినీ అండన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 13 కేంద్రాలను అద్దె భనాల్లో నిర్వహిస్తున్నారు. వాటిల్లో వసతులు సక్రమంగా లేకపోవడంతో చిన్నారులతో పాటు సిబ్బంది అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు - నేడు పథకం ద్వారా అరకొర పనులు చేసి నిధులు కాజేశారే తప్ప అంగన్‌వాడీ భవనాల అభివృద్ధి చేపట్టలేదని చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీలకు నూతన భవనాలకు నిర్మించి, వసతులు కల్పించాలని కోరుతున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి: పాశిం



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. పలు సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేకు వినతులను అందజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం టీడీపీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు సంక్షేమానికి టీడీపీ అండగా నిలుస్తుందన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి ప్రమాద బీమా రూ.5లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసి సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే గూడూరు నియోజకవర్గాన్ని మొదటిస్థానంలో నిలిపేందుకు కృషిచేయాలన్నారు. ఇచ్చిన హమీలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు పరుస్తూ ప్రజాదరణ పొందుతోందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రాంగోపాల్ రెడ్డికి నివాళి

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రాంగోపాల్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం సూళ్లూరుపేటలో జరిగాయి. సూళ్లూరుపేట జూనియర్, డిగ్రీ కాలేజీల్లో తెలుగు అధ్యాపకుడిగా సుదీర్ఘ కాలం పనిచేసిన ఈయన శుక్రవారం కన్ను మూసిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహానికి శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి, సూళ్లూరుపేట హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆదూరు శ్రీనివాసులు, ఎల్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ఉస్మాన్ భాషా, డాక్టర్ అనురాధా, ఆర్ఎంఎస్ భాస్కర్ బాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాంగోపాల్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి

పాఠశాలకు ఫ్లోర్‌మ్యాట్స్ వితరణ



పాఠశాలకు ఫ్లోర్‌మ్యాట్స్ అందజేస్తున్న దాతలు

గూడూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు వాకాటి రామ్మోహన్, పసుపులేటి ప్రసాద్ దాతృత్వంతో ఫ్లోర్‌మ్యాట్స్‌ను శనివారం వితరణగా అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా పూర్వ విద్యార్థులు పాఠశాలకు అవసరమైన ఫ్లోర్‌మ్యాట్స్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతూ మృతిచెందిన ఓ వృద్ధుడి మృతదేహానికి శనివారం మెగా బ్రదర్స్ సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వృద్ధాశ్రమంలో ఆశ్యయం పొందుతున్న కృష్ణయ్య(85) అనారోగ్య కారణంగా శనివారం మృతిచెందాడు. ఈ విషయాన్ని ఆశ్రమ నిర్వాహకురాలు కల్యాణి మెగా బ్రదర్స్ సేవాసమితి నిర్వాహకుడు తీగల చంద్రశేఖర్‌కు తెలియజేశారు. కృష్ణయ్య మృతదేహానికి హిందూ సంప్రదాయ ప్రకారం సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్, ఓంకార్, వెంకటేష్, మధుసూదన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

చిల్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నదానం చేశారు.

నరసింహ యాదవ్ నియామకం హర్షణీయం

పెళ్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గొల్ల నరసింహ యాదవ్ నియామకం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నరసింహ యాదవ్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి సీఎం చంద్రబాబు నామినేటడ్ పదవి ఇచ్చారన్నారు.

నేడు 104 ఉద్యోగుల నిరసన

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ జి.నాగవెంకటేష్ వెల్లడించారు. స్థానిక యశోదానగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 104 ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని, సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరినా స్పందన లేని కారణంగా ఆదివారం నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు.

సాయిబాబా మందిరంలో సత్యనారాయణ వ్రత పూజలు

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కేఆర్‌పాలెంలో ఉన్న సాయిబాబా సత్సంగ మందిరంలో శనివారం సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించారు. ఏటా కార్తీక మాసంలో సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చి వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ భక్తులచే సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పి.రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుష్పయాగం



నాయుడుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. స్కంధ షష్టి మహోత్సవాల చివరిరోజున శనివారం స్వామివార్లకు ప్రత్యేక పుష్పాలతో యాగం నిర్వహించారు.

పంటలకు బీమా తప్పనిసరి

పెళ్లకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులందరూ తమ పంటలకు బీమా తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ సూచించారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్‌లో ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తుందన్నారు. రైతులు ప్రధాన పంటగా సాగుచేసే వరితో పాటు వేరుశనగకు బీమా సౌకర్యం కల్పించిందన్నారు. ఈ రెండు పంటలకు డిసెంబరు 15వ తేదీలోగా బీమా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ చందు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లపరెడ్డికి నేతల శుభాకాంక్షలు



జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీడీపీ నాయకుడు, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కోట పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, అభిమానుల సమక్ష్యంలో జగన్‌మోహన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్ గురుస్వామి, ప్రసాద్, సుధాకర్, వీరరాఘవులు, సుబ్బయ్య, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శనివారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో సురేష్‌రెడ్డి దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాధయ్య, నాగరాజు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరు ధర్నాను విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న ప్రజాపోరు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రోజురోజుకూ నిత్యావసరాల ధరలు పెరిగిపోతుండడంతో సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలపై విద్యుత్‌భారం పడకుండా ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. అనంతరం సీపీఎం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. నియోకవర్గ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా జోగి శివకుమార్, కమిటీ సభ్యులుగా శ్రీనివాసులు, సురేష్, రమణయ్య, హరినాథ్, ముత్యాలయ్యను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మురళి, యాదగిరి, శివకుమార్, మణి శ్రీనివాసులు, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, ముత్యాలయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌కు చిట్టేడు విద్యార్థి



జాతీయ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన శైలేష్, నిష్వితను అభినందిస్తున్న కిషోర్

కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల పాఠశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న శైలేష్ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శేషవర్ధన్, చంద్రశేఖర్, పీడీ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో అండర్-19 స్కూల్ గేమ్స్ బాలుర కబడ్డీ పోటీలు జరిగాయి. నెల్లూరు జిల్లా తరపున శైలేష్ పాల్గొని రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించాడు. డిసెంబరు 7నుంచి 11వ తేదీ వరకు హర్యానాలో జరిగే నేషనల్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ తరపున కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో శైలేష్ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే కోటలోని ప్రగతి విద్యానికేతన్‌లో 8వ తరగతి చదువుతున్న నిష్వితవిలు విద్య పోటీలో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ తెలిపారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో మన్యం జిల్లా జోగింపేట గురుకుల పాఠశాలలో రాష్ట్రస్థాయి విలువిద్య అండర్14 పోటీలు జరిగాయి. ఇందులో నిష్విత ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు గుజరాత్‌లోని నాదియాక్‌లో జరిగే జాతీయస్థాయి విలువిద్య పోటీల్లో నిష్విత పాల్గొంటుందని కిషోర్ తెలిపారు. శనివారం నిష్వితను షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ షరీనా

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో శనివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రవికుమార్ దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెలా జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. జేవీవీ సంస్థ సైన్స్ పట్ల అవగాహన పెంపొందించే కార్యక్రమాలను చేపట్టడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, ప్రభాకర్, రాధయ్య, విజయ్‌బాబు, అశోక్, సుబ్బారావు, జగదీష్, రవికుమార్ పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడులు

చిల్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట స్థావరంపై ఎస్ఐ సురేష్‌బాబు సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 4 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, రూ.15370 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది విష్ణు, రాజా, అల్లాం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం: ఒకరి అరెస్టు

మంగళం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు పరిధిలోని జాతీయ రహదారివద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేసి కారుతో సహా ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా టాస్క్‌ఫోర్సు సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బృందం, అటవీశాఖకు చెందిన ఎఫ్‌బీవో నాగేశ్వర నాయక్ బృందాలు రైల్వేకోడూరు రెడ్డిపల్లి చెరువు సమీపంలో శనివారం ఉదయం తనిఖీలు చేపట్టారు. అధికారులను గమనించిన ఇద్దరు స్మగ్లర్లు కారును పక్కకు ఆపి దిగి పారిపోవడానికి ప్రయత్నించగా, టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒకరిని పట్టుకోగలిగారు. అతడిని కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో దాచిన ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన స్మగ్లర్‌ను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.